ఓం నమః శివాయ

శుభమస్తు                                                                 అవిఘ్నమస్తు



# శివదీక్షా పరులు

రచన

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

M.Tech.



## ప్రార్థన

కం॥ శ్రీ తరుణిని జేబట్టెను
భీతిల్లిన బాలు బ్రోచి విరిచెను దనుజున్
ప్రీతిగ బలి నర్థించెను
ఘాతకులగు నృపులదునిమె ఘనుడా హరియే

కం॥ ఎందున్నాడీతండని
అందరు నినుబూని వెదకి అలిసెదరయ్యా!
ఎందెందో వెదకాలా?
ఎందైనా నీవె తండ్రి! ఈశ్వర! హరివై

కం॥ సాయీ! నీవే సాయము
సాయీ! జనకుండు నీవె, సఖుడవు నీవే
సాయీ! నీవే దైవము
సాయీ! రక్షకుడు నీవె, శంకరుడీవే.



కం॥ శివగాథలు నేజెప్పెద
శివబోధలు సుందరములు సేమకరములున్
శివభక్తాళికి వశుడని
శివ! నమ్మితి నిజముజేసి జేవనొసగుమా.

చం॥ సుర, నర, దానవుల్ వినయ శోభతొ
గొల్చెడి ఆ గజాననున్
శరణని ముగ్గురమ్మలకు సాగిలి మ్రొక్కెద,
వారి భర్తలన్
గురువుల నంచు నమ్మితిని గూల్చెడి
ఆశలు చింత మానితిన్
వరముల పాపపుణ్యముల 'బాదర' దేటికి
దిక్కువారలౌ



## అంకితం

శ్రీ పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం గారూ ఇది నాకు భగవద్దత్తమైన విద్య. ఉదాహరణకు ఈ ముక్తపదగ్రస్తం చూడండి.

కం॥ గిరిజను వలచెను హరుడే
హరుడే నావాడటంచు అద్రిజ మురిసెన్
మురిసెను జగములు, భూసుర
సురవరులెల్లరును కోరి శూలికి చూలిన్.

ఇట్లా నాచిరకాల వాంఛ తీర్చుకొంటున్నాను.

కం॥ బాలూ! నీకంకితమిది
బాలల నడిపించుచున్న బహుముఖ ప్రజ్ఞా
శాలీ! 'చురకలు' మానవు
నీ 'లావు'ను మెచ్చుకొనరె? నిపుణులు ధాత్రిన్

## సూచిక

1. ప్రార్థన

2. అంకితం

3. విషయ సూచిక

4. తొలిపలుకులు

5. కుబేరుడు
(మహావిష్ణువుకే అప్పిచ్చిన మహనీయుడు)

6. అరుంధతి
(మూడు ముళ్ళతో ముడి పడింది)

7. నందీశ్వరుడు
(జగద్రక్షకుని రక్ష)

8. కాల భైరవుడు
(బ్రహ్మహత్యాపాతకం వదలదు)

9. శరభ సాళ్వుడు
(నరసింహుడే నివ్వెరబోయాడు)

10. త్రిపురాసురులు
(నాస్తిక రాజ్యాధిపతులు)



11. అహుకుడు / నలదమయంతులు
(కన్నీరు పెట్టించిన కలి పురుషుడు)

12. శంఖచూడుడు / తులసి
(పతివ్రతంటే శ్రీహరికీ భయమే)

13. పిప్పలాదుడు
(ఇలాంటి త్యాగి లేడు)

14. ఉపమన్యుడు
(పరమేశ్వరుని మెప్పించిన బాలుడు)

15. మధుకైటభులు
(దారి తప్పితే జగత్పితే పుత్రాంతకుడు)

16. జలంధరుడు
(వరబలం పరమాత్మ బలం ముందు వ్యర్థం)

17. విన్నపం



## తొలి పలుకులు

శివ దీక్షాపరులు, శైవగాథలు శివ భక్తుల గాథలు. శివ పురాణంలో ఉటంకించబడిన అద్భుతమైన కథలు.

నేను కుమార సంభవం వెలువరిస్తున్న రోజుల్లో చదివిన శివపురాణంలోని కథలు నన్నాకర్షించాయి. వాటిలో ప్రముఖులయిన రావణుడు, మార్కండేయుడు, భక్తకన్నప్పల గురించి సినిమాల వల్ల చాలమందికి తెలుసు.

ఎన్నుకోబడిన శివదీక్షాపరులగు పన్నెండుమంది గురించి వివరంగా అతికొద్దిమందికి మాత్రమే తెలుసు. శివ పురాణంలో వారి గురించి దొరికిన వివరాలు తక్కువగా ఉంటే ఇతర కథల్లోనుంచి, పెద్దలు చెప్పిన పురాణ హరికథా కార్యక్రమాల నుంచి గ్రహించాను. కావున మార్పులు చేర్పులు సహజమే. నాకు తృప్తి పద్య రచనలోనే కాని గద్య రచనలో దొరకదు. అయినా ఇది గద్య రచన అవటం వల్ల వివరాలు చక్కగా ఇవ్వటానికి ప్రయత్నించాను. నా తృప్తికి ఒక్కొక్క కథకు ఒక పద్యంకూడా ముక్తాయింపుగా ఇచ్చాను.

ఇక పాఠకుల కోసం నామాట. పుక్కిట పురాణాలు ఇందులో తెలుసుకోవాలసినది ఏముంది అని కొట్టి పారేయకండి. పురాణాలు దైవ గాథలు. దైవం కేవలం అనుభవమేకదా! నీ అనుభవం నీది నా అనుభవం నాది. రెండు వేర్వేరు. రామకృష్ణ



పరమహంసకు ఆ అనుభవం కాళికాదేవి, అన్నమయ్యకు వేంకటేశ్వరుడు, త్యాగయ్యకు శ్రీరాముడు, పోతనకు సరస్వతీ దేవి, తుకారాంకు పాండురంగడు, జగన్నాథుడు ఒరియా వాళ్ళకి- వీరంతా అనుభవమే.

అలా కాకుండా సాకార పదార్థమైతే కొందరికి తెల్లగా ఎలా కనిపిస్తాడు. కొందరికి మీసాల తోటి కొందరికి లేకుండా ఎలా కనిపిస్తాడు. కాబట్టి ఆ పరాత్పరుడు తప్పకుండా నిరాకారుడే. కాని అనుభవంలో మాత్రం సాకారుడే. అది కూడ "ఎవరెటులూహ జేయు అటులే హరి దోచును నమ్మకంబుగా" ఆ పరమాత్మను ముక్కంటిగా, గజచర్మధారిగా, చంద్రశేఖరుడిగా, నీలకంఠునిగా ఊహించిన వారి ఊహలు, అనుభవాలు, దర్శనాలే ఈ గాథలు.

గండభేరుండ పక్షి తలలు, గొర్రె తలలు మనిషికెలా అతుకుతవి? చిన్న పిల్లవాడు, పాలకోసం ఏడిచేవాడు, అడవికి పోయి ఎలా తపస్సు చేస్తాడు తల్లీదండ్రి ఎలా పంపించారు? ఇట్లాంటి 'తెలివి గల' ప్రశ్నల కిందులో తావులేదు. భగవంతుడి అపార శక్తిపై, పామరుడికి కూడా అర్థమయ్యేట్లు, ఆహా! ఆ శివుడు ఎంత అఖండుడు అనుకునేట్లు చేయుటయే ఈ శివదీక్షాపరులు పూర్వోద్దేశ్యం. కోడి గుడ్డుకి ఈకలు పీకే అసాధ్యులకి ఇది నిరుపయోగం.

**www.geetadeeksha.com**

అనే నా వెబ్‌సైట్‌లో నా ఇతర రచనలు చదవండి.

# 1. కుబేరుడు

"ధనమూల మిదం జగత్" అన్నారు ఆర్యులు. అంటే "డబ్బుకు లోకం దాసోహం" అని చెప్పుకోవచ్చు. అటువంటి ధనాధిపతి కుబేరుడి గురించి తెలుసుకుంటే ఆయన కథ అతి విచిత్రమైనది.

ఈ కుబేరుడు సాక్షాత్తూ సర్వేశ్వరుడిచే నియమించ బడ్డవాడు. పరమ శివభక్తుడు. ఉత్తరదిక్కునకు అధిపతి. వీని వాహనం గుఱ్ఱము. ఆయుధము పరమేశ్వరుడు ఇచ్చిన ఖడ్గం. ఈతని భార్యపేరు చిత్రలేఖ. జాతి గంధర్వుడు. ఆయన నివసించే నగరం పేరు అలకాపురి. ఈతనిని ధనదుడు అనికూడా పిలుస్తారు.

శ్రీ మహావిష్ణువు కలియుగంలో భూమిపై కేతెంచి రామావతారంలో వేదవతికి యిచ్చిన మాట నిల్పటానికి శ్రీనివాసుడై వచ్చి పద్మావతిని పెండ్లాడదామనుకుంటే పెళ్ళి ఖర్చులకి ధనం ఎలా సంపాదించాలా అని సతమత మవుతుంటే నారదుడు, కుబేరునివద్ద తీసుకోమని సలహా ఇస్తాడు. కలియుగ ధర్మం ప్రకారం చీటీ వ్రాసి ఋణ పత్రం



వ్రాసిస్తాడు శ్రీహరి. దానిని కళ్ళకద్దుకొని మరీ తీసుకుంటాడు కుబేరుడు. వడ్డీ నెలనెలా చెల్లిస్తూ అసలు కలియుగాంతానికి తీర్చి మరీ వైకుంఠం వెళ్తానంటాడు స్వామి.

ఆ విధంగా కుబేరుడి పేరు తెలియని భారతీయుడు ఉండడు. సాక్షాత్తు పరమశివుడు ధనాధిపతిని చేసిన ఈయనపేరు బాగా డబ్బున్న వాడు అనటానికి పర్యాయపదం అయినది. ఈ శివభక్తుడి కథ ఎట్టిదనిన....

ఒకప్పుడు 'కాంపిల్య' నగరంలో 'అగ్నిదత్తుడు' అను సద్బ్రాహ్మణుడు సౌశీల్యవతియైన తనభార్యతో యజ్ఞ దీక్షితుడై, గృహస్థ ధర్మం పాటిస్తూ, సజ్జనుడై యున్నాడు. అతను గొప్ప పండితుడు. బ్రాహ్మజ్ఞులు అతని ఏకైక గారాబు బిడ్డకు 'గుణ హీను' అని పేరు యెందుకు నిర్ణయించారో అతనికి క్రమేపి తెలిసి వచ్చింది. ఆ ముద్దులొలుకు బాలునికి అయిదు మాసాలకి అన్నప్రాసన, అయిదు యేళ్ళ అయిదు నెలలకి అక్షరాభ్యాసం, ఎనిమిదవ యేట ఉపనయనము చేసి మంచి గురువునకు అప్పగించిరి.



కానీ ముద్దులొలుకు ఆ బాలుడు పెరిగి భ్రష్టుడవుతాడని ఎవరు ఊహించగలరు? పాఠశాలకు వెళ్ళకుండా అల్లరి చిల్లరగా తిరుగుట నేర్చిన ఆ సార్థక నామధేయుడు గుణహీనుడు, గృహమునుండి వస్తువులను దొంగిలించి వాటిని అమ్మి తన జూద వ్యసనమును కొనసాగించినాడు. తల్లి ఇంట్లో వస్తువులు మాయ మవుతుండుట గమనించి పుత్రుని "నాయనా చిన్న నాటి వ్యసనము చితుకుల దాకా పోదంటారు. నీవు ఈ చెడు మార్గము వదిలిబెట్టుము యని మందలించెను. కాని అది అతని తలకెక్కలేదు.

అగ్నిదత్తుని బంగారు ఉంగరము ఆయన పూజా మందిరము నుండి మాయమై జూదరియైన గుణహీనుని స్నేహితుని ఇల్లు చేరింది. ఒకనాడు మద్యాహ్నకాలమందు రాజాస్థానము నుండి తొందరగా ఇంటికి వచ్చిన తండ్రికి పుత్రుని స్నేహితుని వ్రేలికి ఉన్న ఉంగరం కనిపించి నిలదీస్తె నిజం బయటపడింది. అగ్నిదత్తుడు రాజుకు ఈ వ్యవహారం తెలిపెదనని బెదిరించగానే ఆ స్నేహితుడు ఏడుస్తూ ఆ వుంగరం అప్పగించి తనదారిన తాను మళ్ళీ గుణహీనునితో జేరనని చెప్పి పారిపోయాడు.



అగ్నిదత్తుడు భార్యతో ఓ **దుర్మార్గురాలా! పుత్రుని తప్పును తండ్రి నుంచి దాచే తల్లి వాని వినాశనకారి. నిప్పును గుడ్డలో దాయటం ఎలా సాధ్యంకాదో ఇంటి దొంగ నిప్పులాగా కనబడకున్ననూ గృహదహనకారి యగును. వీనినిట్లు వదలరాదు. రాజునకు అప్పగించి శిక్షవేయించిన గానీ వీడు మంచిదారి బట్టడు. కాల్చనిదే ఇనుము వంకర సరిజేయలేము** అని చీవాట్లు పెట్టుచూ క్షమించమని వేడిన ఇల్లాలిని మందలించి పుత్రునికై వేచి యుండెను. చెలికాని ద్వారా సంగతి తెలిసిన గుణహీనుడు రాజదండనకు వెరచి అటునుంచి అటే పారిపోయెను.

రాజభటుల భీతిచే దినమున దాగియుండి రాత్రులు పయనించుచూ దారి తెన్నులేక పయనించి ఒకనాటి రేయి తెలియని ప్రదేశమున గూర్చుండి క్షుద్బాధకు రోదించుచు, తల్లిదండ్రుల కన్నీటి కారుకుడైన పుత్రుడగు తనుకూడ పదిరెట్లు ఎక్కువ కన్నీరు కార్చవలసి యుండును అని తెలుసుకున్నాడు.

గర్భిణి కడుపు వలె దొంగతనంగానీ పాపము గానీ

దాగవు. 'బుద్ధిః కర్మాణు సారిణే' అన్నట్లు నా పురాకృత దుష్కర్మ వలన నాకీ దౌర్భాగ్యము దాపురించినది. ఇక నాకు దిక్కు ఆ పరమశివుడే అని రోదించి మగత నిద్దురలో జారుకున్నాడు.

జనం కోలాహలం, మనుష్యుల మాటలు విన్న గుణహీనుడు నిద్రలేచి అటే వస్తున్న జనసమూహాన్ని జూచి **"అయ్యా! మీరెక్కడికెళ్తున్నారు? నన్నుకూడా మీవెంట తీసుకుని వెళ్ళగలరా"** అని వేడుకొనగా వారు **"ఓయీ మేము సోమలింగేశ్వర పట్టణమునకు పోవుచున్న శివభక్తులము రేపు మాఘ బహుళ చతుర్దశి. దానిని మహా శివరాత్రి యందురు. రేపు గోహత్యా పాతకమైనా నివారించగల గౌతమీ (గోదావరి) నదీ స్నాన మాచరించి, ఉపవాస దీక్షబూని రాత్రి లింగోద్భవ కాలమున మహానివేదనము జేసి ఆ ప్రసాదము స్వీకరించిన ఆ ముక్కంటి ప్రీతి పాత్రులగుదురు"** అని జెప్పిరి.

గొప్ప సంతోషముతో గుణహీనుడు వారివెంట బోయెను. గోదావరి నదీమాతకు నమస్కరించి ఆ నదీ మహాత్మ్యమును తలంచుచు స్నానమాచరించి శుచియై



శ్రీసోమలింగేశ్వరుని జూచి ఈ పాపికి నీవే రక్ష అని ప్రార్థించి ఆ లింగమును తదేకముగా జూచుచు "శంకర! శివా! శంభో అని శివనామ స్మరణతో ఉపవాసం చేశాడు.

ఇంతలో పశ్చిమ దిక్కున సూర్యాస్తమయం కాబోతున్నది. నింగిలో దేవ కన్యలు పసుపు రాసుకొని కుంకుమ నలంకరించు కొనుచున్నట్లు పద్మాలు వెలవెల పోతుండగా సూర్యుడు కనుమరుగయ్యాడు. చతుర్దశి చీకట్లు భూదేవిని ముసుగులా కప్పుకొన్నవి. శివనామ స్మరణ నిరాటంకంగా జరుగుతూనే వున్నది.

రాత్రి రెండవ జాము ప్రవేశించగానే రక్షక భటులు కావలి రాగా మహాదేవునికి మహా నివేదనం చేయుటకు బ్రాహ్మణులు మంగళ వాయిద్యములతో ఘంటా నాదములతో వారి కార్యక్రమం మొదలుపెట్టారు. గుణహీనుని గురించి పట్టించుకున్నవారే లేరు. మహా నివేదనము అయిన పిమ్మట భక్తులు ఏమి భాగ్యము. మహాదేవుని కరుణచే యాత్రా ఫలము దక్కినది. ఓ నిద్రాదేవీ! ఇక నీచిత్తం వచ్చినట్లు లోకాన్ని నీ కౌగిలిలో



చైతన్య రహితులను జేసి నీ అధికారం చూపించుకో అన్నట్లు ఒక్కొక్కరే నిద్రలోకి జారుకున్నారు. ఒకే ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారునూ ఒకే క్షణమున చనిపోరు గదా.

ఆకలి బాధ తాళలేని గుణహీనునకు నిద్దుర బట్టక నెమ్మదిగా ఒక ప్రసాదపు పాత్రను దొంగిలించి అది తినుటకు సిద్ధమయ్యెను. వానిని మసక చీకటిలో జూచిన ఒక రక్షక భటుడు 'దొంగ, దొంగ' అని అరిచి అతని వెంటబడెను. ఆ అరుపులు 'గోవింద గోవింద' అని వినబడి భక్తులు లేచి తత్తర పడి గుణహీనుని తరమ సాగారు.

నందీశ్వరుని వద్ద దాగుటకు ప్రయత్నించి నందివలె వంగి కూర్చున్న గుణహీనుడు కొంతమంది అర్చకులు తనవైపు రావటం జూచి ఒక్కసారే లేచి పారిపోవుటకు ప్రయత్నించగా, శిరస్సు నందీశ్వరుని తలకు తగిలి తల పగిలి అక్కడికక్కడే మరణించాడు. మాన, ప్రాణ, పుణ్యములను ఒక్కసారే హరించు ఆకలిని ఆ దేవదేవుడు



ఎందుకు అంటగట్టినాడో కదా!

మానవుల శరీరం వదిలి జీవుడు వెలువడగానే ఆ జీవుణ్ణి తమవెంట వాడికి అర్హ మయిన లోకాన్ని (యమలోకం పాపులకు, దేవలోకాలు పుణ్యులకు) నిశ్చయించి ఆలోకానికి కొని పోవుటకు ఆ లోక భటులు వచ్చి (యమలోకమైతే ఈడ్చుకొని, పుణ్యలోకాలయితే దైవ విమానాలలోనూ) తీసుకుని వెళ్తారు. అదే విధంగా గుణహీనుడి జీవుని తీసుకు పోవటానికి నరకంనుంచి యమభటులు, కైలాసం నుంచి శివగణములు వచ్చిరి.

వారిలో శక్తిమంతులైన శివగణములు గుణహీనుని జీవుని విమానంలో తీసుకు కైలాసం పోయే ప్రయత్నంలో ఉండగా యమభటులు **"అయ్యా! ఇదేమి వింత, ఈ త్రాగుబోతు, కులద్రోహి, పితృ ద్రోహి, శివద్రోహి. ఈ భ్రష్టునికి కైలాసమా? ఈ నీచునివంటి వారు మీ దయ బొందిన జగతిలో ధర్మముండునా!"** అన్నారు. దానికి శివభటులు **"అయ్యా! ఒక ధర్మసూక్ష్మం తెలుసుకోండి. సదాచార సంపన్నుడైన ఒక ఉత్తమ బ్రాహ్మణునకు పుట్టుట**

**వీడు పుణ్యాత్ముడే కాని పూర్వజన్మ కృత పాపముచే భ్రష్టుడయినాడని దెలియుచున్నది. ఇక ఆ పాపము కూడా మహా శివరాత్రినాడు పవిత్ర గౌతమీనది స్నానంచేసి, రోజంతా ఉపవాసం జేసి రాత్రి శివనామ జపంతో జాగరణ చేసి అఘోజనుడై నందిచే కపాలమోక్షం జెంది ఆలయంలో మరణించిన ఇతనికంటె పుణ్యాత్ముడెవరు?**

**వీడు కైలాసవాస యోగ్యుడు. ఇక మీరు మీదారిన బొండు. లేనిచో మార్కండేయునికై వచ్చి శివునిచే పరాభవింపబడిన మీ యజమాని గతే మీకు పడుతుంది** అని జెప్పి వారిని వారి లోకానికి పంపివేశారు. శివసాన్నిధ్యములో కొంతకాలము గడిపి అతడు అరిందమునిగా జన్మించెను. అరిందముడు గొప్ప శివభక్తుడైన రాజు. శివ, కేశవ ఆలయములు గట్టించి, గొప్ప శిల్పములు చెక్కించి, సత్రములను, విద్యాలయములను కట్టించి, ఎంతో మందికి భుక్తికూడా ఏర్పాటు చేశాడు. వాస్తు శాస్త్రాన్ని జన బాహుళ్యంలోకి తెచ్చి ఒక క్రమ పద్ధతిలో గృహ నిర్మాణం జరిగేలా చూచి నాగరికత సక్రమంగా పెరిగేట్లు చేశాడు.



ప్రజా రంజకుడైన అరిందముడు ఆలయాలకు మాన్యములు వ్రాసిచ్చి, గొప్ప తటాకములు త్రవ్వించి ప్రజా క్షేమానికై అహర్నిశలూ పాటుపడి మరల ఈ జన్మలో గూడ స్వచ్ఛందంగా శివసాన్నిధ్యంలో శివరాత్రినాడు జాగరణ, ఉపవాస, శివనామస్మరణలతో కాలం గడిపి శివప్రసాదం తీసుకుని తనువు చాలించాడు.

జ్ఞాన సంపన్నుడైన అరిందముడు కొంతకాలము శివసాన్నిధ్యములో సంతోషముగా నుండెను. తరువాత బ్రహ్మ యొక్క మానస పుత్రుడైన పౌలస్త్యునకు, వైశ్రవస్సుడు అను కుమారునిగా జన్మించెను. ఆ వైశ్రవస్సుడు ఈశ్వరునికై ఘోర తపమాచరించగ ముక్కంటి ప్రత్యక్షమై అతనికి అనేక వరములొసగుటే గాక, విశ్వకర్మచే సముద్ర మధ్యమున సుందరమైన సువర్ణలంకను నిర్మింపజేసి పెక్కు దివ్య వనములతోను, సరస్సులతోను, చెట్లతోను, సువర్ణ హర్మ్యములతోను నిర్మించబడిన లంకా నగరమును కానుకగా నొసంగెను. అట్లు లంకా నగరమునకు రాజయిన వైశ్రవస్సుడు ప్రజా రంజకముగా రాజ్యమునేలుచుండెను.



పౌలస్త్య బ్రహ్మకు కైకసి అను రాక్షస భార్య గలదు. ఆమె ద్వారా ఆయనకు రావణుడు, కుంభకర్ణుడు, విభీషణుడు అను ముగ్గురు కుమారులు కల్గిరి. బ్రాహ్మణుడైన తండ్రి వలన రావణుడు బ్రాహ్మణుడై కూడ తల్లియొక్క రక్తముచే రాక్షస ప్రకృతిగలవాడయ్యెను. తరువాత కాలమున సీతా సాధ్విని అపహరించి విష్ణుని అవతారమైన శ్రీరాముని జేత మరణించాడు. సవతి అన్నగారైన వైశ్రవస్సుడంటే అతనికి వల్లమాలిన ఈర్ష్య ద్వేషములు అలవడినవి.

బ్రహ్మచే అజేయమైన వరములు పొందిన అతడు ఏ దేవజాతి అనగా దేవ, గంధర్వ, కిన్నెర, కింపురుష మొదలైన జాతివాడైనను తనను జంపకుండునట్లు అట్టివారిచే మృత్యువు కలుగకుండునట్లు వరము పొంది దేవేంద్రునితో సహా దేవతలను జయించి తన చెప్పు చేతలలో ఉంచుకొనెను. ఆ రావణుడు వైశ్రవస్సుని లంకానగరమును దౌర్జన్యముగా ఆక్రమించి బ్రహ్మ ప్రేమగా ఇచ్చిన పుష్పకము అను దివ్య విమానము కూడా అపహరించెను.



ఎంతమంది ఎక్కినా మరియొక్కనికి చోటు ఉండు ఆ దివ్య విమానమే సీతామాత అపహరణకు కారణ భూతమయినది. వరబల గర్వితుడైన రావణుని ఏమీ చేయలేక వైశ్రవస్సుడు బ్రహ్మతో మొరబెట్టుకున్నాడు. ఆ పరమేష్ఠికూడా తపోధనులకు అధీనుడనైన నేను ప్రస్తుతము ఏమియూ చేయలేనని పరమేశ్వరుని బూజించమని చెప్పెను.

దానికి ఆతడిట్లాలోచించెను. ఈ బ్రహ్మను అనృత దోషము కలుగగా వీని ఐదవ తలను ఖండించి చతుర్ముఖుని జేసిన ఆశంకరుడే నాకుగతి. ఏ వర బలమునకు తను అధీనుడైయున్నాడో ఆ వరబలమును సంపాదించెదను అని ఈశ్వరునికై తపమాచరించెను. ఆ ప్రదేశమున పరదేవత అన్నపూర్ణగా సర్వ మానవ కోటి క్షుద్బాధ దీర్చు జగన్మాతగా, శివుడు ఆమె భర్తయై జగన్నాయకుడైన విశ్వనాధునిగా వెలసిరి. కాశీ పట్టణమని ప్రశస్తి చెందిన ఆ పన్నెండు క్రోసుల ప్రదేశమున, ఒంటికాలిపై గాలినే ఆహారంగా, తనదృష్టి ఆ మహాలింగము పైననే కేంద్రీకరించి ఘోర తపము చేయసాగాడు. ఆ కఠోరమైన తపస్సుయొక్క తాపమునకు జగములు ఉక్కిరి బిక్కిరియై పోతున్నాయి.

దేవేంద్రుడు అట్టి తపస్సును చెడగొట్టడంలో అసాధ్యుడు. తామస వర్తనులైన ఘోరతపోనిష్ఠులగు విశ్వామిత్రునివంటి మహా తపోనిధుల దీక్షను అతను మేనక హొయలచే చెడగొట్టించిన సంగతి అందరూ యెరిగిన కథే.

అయితె వైశ్రవస్సుని కఠోర తపోదీక్ష ఎటువంటిదంటే కుండెడు నీళ్ళు పొయ్యినార్పగలవు గానీ అగ్నిపర్వతాన్ని చల్లార్చలేవుగదా. అట్లే దేవేంద్రుని జిత్తులు వైశ్రవణుని ఏమీ చేయలేక పోయాయి. బ్రహ్మవచ్చి చెప్పినా అతను తపోదీక్ష మానలేదు.

ముల్లోకాల మొర విన్న ఆ వ్యోమకేశుడు స్వయంగా కదలి వచ్చి వైశ్రవస్సుని జూచి **శరీరంలో ఎముకలు చర్మం దప్ప ఏమీ మిగిలి యుండనట్టి కఠోర తపంచేసి నీవు నాకు అపరిమితమైన ఆనందం కలిగించావు. నీవంటి భక్తుడు ఏమి గోరినా జేస్తాను. చివరికి నీవాకిలి కాపలా కూడా యుంటాను. నీకు ఏది ప్రీతిపాత్రమో అది నిస్సంకోచంగా కోరుకో** అన్నాడు.



పరమేశ్వరుడు ఈ పలుకులంటుండగానే వైశ్రవస్సునికి ఎముకలగూడులాంటి దేహం పోయి సుందరమైన, బలిష్ఠమైన దేహం చేకూరింది. ఆయన ఆనందంగా **ఓదీనరక్షకా పరమశివా! నిన్ను కోరుకునే శ్రేష్ఠతమమైనదేమి? నీ దివ్య మంగళ రూపము చూచుటకంటే కోరదగిన వరము ఏది? అతి మధురమైన నీ కంఠస్వరం వినుటకంటే వేడుకోదగ్గ వరమేముంటుంది? దివ్యానందం కలుగ జేసే నీ తలపుకన్నా మధురమైనది ఏది. అవి యన్నీ తృటిలో నీ సమక్షంలో నెరవేరినవి. ఈ ఆనందం నాకు సదా కలుగ వలెనంటే మీ స్నేహం ఒకటే మార్గం కదా! కనక నన్ను మీ మిత్రునిగా జీవించు అదృష్టం ప్రసాదించండి. మీరు నేను నివసించు తావున నివసించిన నేను కోరుకొనునప్పుడు మీ దర్శన భాగ్యం కలిగితే చాలు ముల్లోకాధిపత్యం ఆ అదృష్టం ముందు సూర్యకాంతి ముందు దివిటీలాంటిది”** అన్నాడు.

దానికి నిటలాక్షుడు **“మిక్కిలి సంతోషం కలిగించే నీమాటలే నన్ను నీమిత్రత్వం పట్ల ఆకర్షింపజేస్తున్నవి. నీ లంకాపురి రావణుడు అపహరించాడని చింతించకు. కర్మనెదిరించుట సాధ్యమా? భస్మాసురునికి భయపడి నేను**



**పరుగులెట్టలేదా? హిరణ్యకశిపునికి చిక్కకుండా శ్రీహరి తప్పించుకోలేదా? అందుకని విచారం మాని దివ్యమైన స్వర్గ సన్నిభమైన అలకాపురిని స్వీకరించు. ఇది లంకా నగరమునకు అన్ని విధముల దీటైనది.** అని అప్పటికప్పుడు విశ్వకర్మను రావించి అలకాపురి అనే దివ్యమైన నగరం సృష్టించి అతనికి ఇప్పించాడు. దివ్యమైన సౌధాలతో రమ్యమైన ఉద్యానవనాలతో అలరారుతున్న దానిలో అతని భృత్యులై ఏలుబడి వారై యుండుటకు గుహ్యకులు, జక్కులు, కిన్నెరులు అను దేవగణములకు అతనిని ఏలికను జేసి ఇచ్చెను.

**“ఓయీ వైశ్రవస్సూ! నేటి నుంచి నీవు ‘కుబేరుడు’ అను పేరున జగద్విఖ్యాతి గాంచెదవు. నవ నిధులకు నీవు అధిపతివై ‘ధనదుండు’ అని పేరు పొందెదవు. సిరి సంపదలు కలవాడనుటకు నీపేరు పర్యాయ పదమై వర్తించును.**

**1.** మహాపద్మము **2.** పద్మము **3.** శంఖము, **4.** మకరము **5.** కచ్ఛపము **6.** ముకుందము **7.** కుందము **8.** నీలము **9.** ఖర్వము అను నవ నిధులకు నీవు అధిపతివి.



**నీవు దేవతలకు, నాగులకు, నరులకు ధనమునిచ్చి వారి కర్మానుసారం ధనమును హరించి ఆ విధంగా శిక్షించి భువనాలలో నీతి ధర్మం సుస్థిరంగా ఉండునట్లు జేయుము. రానున్న కాలంలో మహావిష్ణువే నీవద్ద ఋణము స్వీకరించి నీపేరు ధనవంతులకు పర్యాయ పదంగా జేస్తాడు. చిత్రలేఖ నీకు అర్ధాంగియై నీకు సదా ఆనందం చేకూరుస్తుంది. నీవు పిలిచిన నీముందు నిలిచి నిన్ను అనుగ్రహిస్తాను”** అని అంతర్ధానమైనాడు. నాటినుండి కుబేరుడు ధనాధిపతియై, ఉత్తరధిక్పాలుడై ప్రఖ్యాతి గాంచాడు.

చం॥ సిరులకు యేలికై యితడు స్నేహము నెంచెను
మిన్నయంచు, ఆ
వరుసనె పిల్చినంతటనె వారిజనాభుని
గొప్ప పెండ్లికై
విరివిగ పైకమిచ్చెను కుబేరుడు విజ్ఞుడు
పేరుగాంచెను
త్తరదిశయేలికాయె శివదాసుడు నెచ్చెలుడాయె
భక్తితో

# ౨. అరుంధతి

సంప్రదాయ హిందూ వివాహం అందరినీ ఆకర్షించేది 'అరుంధతి' దర్శనం. ఇది రాత్రి జరుగవలసిన తంతు. నక్షత్రాలుంటే దర్శనమిస్తాయి కనుక. అయితే చంద్రునిపై మనిషి కాలుపెట్టు ఈ రోజుల్లో 'అంతావేగం' అందుకని కొన్ని కొన్ని పెళ్ళిళ్ళు పగటి కాలంలోనే ముగించాల్సి వస్తోంది. ఐదు రోజుల పెళ్ళిళ్ళు అయినవి కదా. ఇది పరిణామక్రమం అని సరిపెట్టుకోవాలి.

అయితే 'అరుంధతి' దర్శనం నేటికీ తప్పనిసరిగా జరిగి ప్రజల్ని ఆకర్షిస్తున్న వివాహ తంతు. తప్పనిసరిగా జరిగే ఈ తంతులోని అరుంధతి ఎవరు? ఆమె గొప్పతనం ఏమిటి? ఎందుకు ఆ దర్శనం చేయిస్తారు. అరుంధతీ దర్శనం నేతిబీరకాయలో నెయ్యిలేనట్లే అరుంధతి దర్శనం కాదని ధ్రువనక్షత్ర దర్శనం అని చాలమందికి తెలియదు. తెలియని విషయాలు తెలుసుకోవాలి. అరుంధతిని చాలమంది చూడలేదు. నిజం.



భూగోళానికి దక్షిణధ్రువం, ఉత్తర ధ్రువం ఉంటాయి. ఈ రెంటినీ కలిపే ఒక ఊహా సరళ రేఖపై ఉండేదే ధ్రువ నక్షత్రం. భూమి తిరుగుతున్నప్పుడు మిగతా నక్షత్రాలన్నీ వేరువేరు చోట్ల కనిపిస్తాయి. స్థానభ్రంశంలేనిది ఒక్క ధ్రువ నక్షత్రం మాత్రమే. ఉదాహరణకి సప్తఋషి మండలం ఒకచోట రాత్రి 7 గంటలకి కనిపిస్తే తెల్లవారు జామున 5 గంటలకి ఇంకొకచోట కనిపిస్తుంది. ఇదంతా భూభ్రమణం వల్ల జరుగుతుంది. అరుంధతిని 'చూచే' ముందు ఆకాశంలో అదెక్కడ ఉంటుందో తెలుసుకుందాం.

'అరుంధతి' ని చూడండి అని హడావిడి చేస్తారు. కాని మనం చూసేది ధ్రువనక్షత్రాన్ని. దాన్నే 'పోల్‌స్టార్' అంటారు ఆంగ్లంలో. ఉత్తర ధ్రువం దగ్గర ఉండే ధ్రువనక్షత్రానికి సప్తఋషి మండలంలో వశిష్ట నక్షత్రం ప్రక్కన మినుకు మినుకుమనే అరుంధతీ నక్షత్రానికి సంబంధమే లేదు. సప్తఋషి మండలంతోపాటు పరిభ్రమించే అరుంధతీ నక్షత్రం కొన్నివేళల్లో భూపరిభ్రమణం వలన కనిపించను కూడా కనిపించదు. ఎప్పుడూ స్థిరంగా ఉండి రాత్రి కనబడి పగలు కనబడకపోయినా అదేచోట ఉండే ధ్రువనక్షత్రమే



పెళ్ళిళ్ళలో అరుంధతి అని చూపించేది. మనిషికి, అనాదిగా నావికులకు దిక్కు చూపించే దిక్సూచి అదే.

వివాహంలో ప్రవేశ హోమం చేయించిన తరువాత వధూవరులను పురోహితుడు బయటకు తీసుకుని వెళ్ళి ఉత్తర దిక్కుగా అరుంధతిని చూడండి అని ధ్రువ నక్షత్రాన్ని చూపిస్తాడు. ఈ మంత్రం చదువుతాడు.

మం॥ధ్రువక్షిత ధ్రువయోనిః, ధ్రువమసి ధ్రువస్థితం

త్వం నక్షత్రాణాం మేథ్యసి సమాపాహి పృతన్యతః

అర్థం : ఓ ధ్రువ నక్షత్రమా నీవు స్థిరమైన దానవు. ఇతర నక్షత్రములకు మార్గదర్శకురాలవు. నీవు ఆధారముగా నక్షత్రమండలమంతా పరిభ్రమించు చున్నది. నీ నివాసము నాశనము లేనిది. ప్రతి గృహములోన నీ స్థిరత్వము కలిగి నేనుకూడా కలుగ జేసెదను గాక. వసిష్ఠుని పత్నియు పతివ్రతా శిరోమణివైన నీవు నాపతితో పాటు స్థిరమైన దీర్ఘమైన జీవితము మరియు కీర్తి ఆనందము కలుగ జేయుము.



మంత్రం ద్వారా చేసిన ఈ వాగ్దానం హిందూ వివాహానికి మూలాధారం. ఆ ప్రతిన నిలబెట్టుకుంటే ఇంక సంసారమే స్వర్గం.

అరుంధతి పతివ్రతకు పర్యాయ పదం అయింది. ఆమె కథ తెలుసుకుంటే మరి ఆనందమే కదా.

బ్రహ్మ మానస పుత్రులలో కశ్యపునివలె మరీచి కూడా గొప్ప తపస్సంపన్నుడై పేరు గాంచెను. మధ్యాహ్న మంతయూ అటువంటి గొప్ప ఋషులను బుట్టించిన బ్రహ్మ సాయం సమయమున సంధ్య అను స్త్రీని సృష్టించెను. అత్యద్భుత సౌందర్య రాశియైన ఆ వనితను జూచి మహా మునులతో బాటు బ్రహ్మకూడా చిత్త చాంచల్యము పొందెను. కంచే చేనును మేస్తే గతేమిటన్నట్లు ఈ ఘోరం జూచి పరమేశ్వరుడు ప్రత్యక్షమై తండ్రీ తనయులు ఒకే స్త్రీని గోరుట గోహత్యవంటి నీచము, తగదు అని సంధ్యను కైలాసమునకు పోయి ఈశ్వర ధ్యానంతో తపస్సు చేయమని పంపించి వేసెను. పిమ్మట గౌతముని వంటి మహా ఋషులను రావించి ధర్మ శాస్త్రములను నియమములను వృత్తులను జగత్తును శాసించునట్లు చేసెను.

అప్పుడు సంధ్య మోహముచే ఇంద్రియ పతనమైన బ్రహ్మకు అరువది నాల్గువేలమంది అగ్నిష్వాత్తాదులను వారు, ఎనుబది ఆరువేలమంది బర్హిషులనువారు బుట్టిరి. వీరిని పితృగణములని బిలిచెను. అదే కాలమున మరీచి మొదలగు ఆర్గురు మహామునులకు గాక తక్కిన వారు సంధ్యను కోరుట వలన క్రతువునకు సోమపులు, వసిష్ఠునకు కాముడును, పులస్త్య, కాశ్వప, అంగీరసులకు హవిష్యదాదులును జన్మించిరి. వీరందరునూ తిరిగి పితృగణములతో గలసి కవ్యభోజనులైరి. వీరందరూ జన్మించుటకు సంధ్య కారణమైనందున, సంధ్య 'పితృమాత' అనిపేరు బొందినది.

దక్ష ప్రజాపతి కుమార్తెలలో 'రతి' అతిలోక సౌందర్యవతి. స్త్రీలను కూడా సమ్మోహపరచే ఆమెకు ఎవరు తగిన వరుడా అని బాగుగా ఆలోచించి, శ్రీలక్ష్మి శ్రీమహా విష్ణు దంపతుల ముద్దు బిడ్డడయిన మన్మధుని ఆమెకు భర్తగా ఎంపిక జేసి దక్షుడు విష్ణుమూర్తిని పూజించి తన పుత్రికను వాని కోడలిని జేయుటకు ఒప్పించాడు. వివాహ సమయంలో



తన కూతురి కంటే ఒకింత అందంగా యున్న అల్లుణ్ణి జూచి ఆనందించి బ్రహ్మ యిచ్చిన పంచ పుష్ప బాణాలతో బాటు అదనంగా భ్రమ కలుగజేసే శక్తిని ప్రసాదించాడు దక్షుడు. దానివలననే కామాతురులకు తము జేసే తప్పులన్నీ ఒప్పులన్నట్లుగా తము వలచిన వారు సర్వ శ్రేష్టులుగా భ్రమ కలిగించే శక్తి ఇచ్చాడు.

దానివలన స్త్రీ పురుషులు పరస్పరాకర్షితులై సంభోగించి జగతిలో ప్రాణికోటిని పెంచి సృష్టి వృద్ధియగుటకు తోడ్పడెదరు, అని జెప్పి ఆయన అంతర్ధానమయ్యెను.

కాని నేడు ఆ మన్మధుడే సృష్ఠికర్తనను గౌరవం కూడా లేకుండ నా స్వంత బిడ్డపైనే నాకు మోహం కలుగ జేశాడు. వీనినేమనవలెను. ఓ మన్మధా! నీవు అచిరకాలముననే పరమ శివుని ఫాలాక్షముచే దగ్ధమయిపోదువు గాక అని శపించెను.

వెంటనే మన్మధునికి, అరవిందము, అశోకము, చూతము, నవమల్లిక, నీలోత్పలము అను పంచమ పుష్ప బాణములను, చెఱకువింటిని సంధించి పుష్ప బాణములను



ఎవరిమీదనైన వేయవచ్చునని తనే చెప్పిన విషయం జ్ఞప్తికి వచ్చి **నీవు అశరీరుడవై కూడ నీ ప్రతాపమును ఎప్పటి వలనే చూపగలవు. నీ భార్య రతికి నీవు సశీరుడవై ఆమెకు ఆనందం కలిగించగలవు** అని శాపాంతరమిచ్చెను. దేవతలు లక్ష్మీ నారాయణులును సంతోషించి ఆ దంపతులకు పెక్కు వరంబులిచ్చిరి.

అనంతరం బ్రహ్మ వసిష్ఠుని బిలిచి **ఓ మహామునీ నీవు కైలాసమున ఒంటిగా తపస్సు చేస్తున్న సంధ్యకు శివపంచాక్షరీ మంత్రం యుపదేశించి దానిని ఆమె జపించునట్లు జేసి రావలసినది** అని జెప్పెను. వసిష్ఠుడు సంధ్యను జూచి బ్రహ్మ చెప్పినట్లు జేసెను.

ఆమె అకుంఠిత దీక్షతో పరమేశ్వరుని గూర్చి తపము నాచరించెను. తన తప్పు ఏమీ లేకున్ననూ ఒరుల తప్పిదమునకు శిక్షింపబడిన ఆమెను జూచి పరమేశ్వరుడు ప్రత్యక్షమై **ఓ బాలా! నీ తపస్సునకు ఎంతో సంతోషించాను నీకు కావలసిన వరం కోరుకో అన్నాడు.**



దానికి ఆమె **నా తప్పు లేకున్ననూ పరులంతా నను కామాతురులై చూచి నాకు హాని కలిగించారు. స్త్రీకి శీలం కంటే ప్రాణం ముఖ్యం కాదని ధర్మ శాస్త్రాలు జెబుతున్నాయి. కావున నా ఈ దేహం యోగాగ్నిలో దగ్ధంజేసి మళ్ళీ జన్మించి గొప్ప పతివ్రత అని ముల్లోకాలలో పేరు పొందునట్లు వరమిమ్ము. నన్ను కాముకుడై జూచువాడు వెంటనే నపుంసకుడగునట్లు, నేను అచంచల పతిభక్తితో గొప్ప పతివ్రతనగునట్లు వరమిమ్ము** అని కోరెను.

పరమ శివుడు సంతోషించి **ఓ సంధ్యా నీకోరిక తప్పక నెరవేరును యోగశక్తిచే నీ శరీరం నశించునపుడు నీవెవరిని ధ్యానింతువో వారే నీపతి కాగలరు. ఆయన గొప్ప పండితుడు, త్రిలోక పూజ్యుడు అవునట్లు అనుగ్రహించు చున్నాను** అని జెప్పి అంతర్ధానమయ్యెను.

ఆ వర ప్రభావంతో సంధ్య అదృశ్యరూపమున మేధాతిథి అను మహాముని యజ్ఞము చేయుచున్న తావున కరిగి అచ్చట తేజోమూర్తిలా వెలుగొందుచున్న వసిష్ఠుని జూచి ఈ మహాముని నాకు భర్తగావలెనని ధ్యానించి

అగ్నికుండమున ప్రవేశించెను.

ఆమె పవిత్ర శరీరమును సూర్య భగవానుడు రెండు భాగాలుగా విభజించి ఊర్ధ్వ భాగమును దేవతలకిచ్చి ప్రాతః సంధ్యగానూ, అధో భాగము పితృదేవతలకిచ్చి దానిని సాయం సంధ్యగాను విభజించెను. ఆమె ఆత్మను నవ్య వస్త్రాలంకృతయైన దివ్య కన్యగా మార్చెను. ఆమెకు అరుంధతి అని పేరిడి ఆమె కోరిక మేరకు అగ్నిదేవుడు మేధాతిథికి పుత్రికగా అప్పగించెను.

ఆయన మహా భాగ్యమని ఆమెను అరుంధతి అని పిలిచి ఆమె శరీర త్యాగము జేయుచున్నప్పుడు తలుచుకున్న తేజోమూర్తి శాంతమూర్తి అయిన వసిష్ఠునకిచ్చి వివాహము చేసెను, మహామునులు, దేవేంద్రాది దేవతలు, త్రిమూర్తులు ఆ వివాహమునకు వచ్చి పెక్కువరములిచ్చి వారిని దీవించారు.

వసిష్ఠుడు సప్తఋషి మండలంలో తారగా మారినప్పుడు అరుంధతి కూడా తారయై మినుకు మినుకమని మెరుస్తూ తారామండలంలో వసిష్ఠుని జేరింది.



ఈ గౌరవం మరి ఇంకొకరికి దక్కలేదు. తార అరుంధతిని చూడమని నేటికీ ప్రతి పెండ్లిలోనూ వినబడే ఆమాట వింటే అరుంధతి ప్రత్యేక స్థానం ఏమిటో ప్రతివానికీ అర్థమవుతున్నది.

ఆ॥ అగ్నికూడ పణికె నామెను తాకంగ
ఆమెజూడ కుండ నవనియందు
పెండ్లికాదు, నిజము, ప్రీతి అరుంధతి
గాథ దెలియ మనకు కలుగు శుభము



## అరుంధతి దర్శనం

ఆకాశంలో ఈ సప్త ఋషి మండలం ఉత్తర దిక్కున కనబడునప్పుడు పరిశీలించి చూడండి.




ధ్రువనక్షత్రం కేంద్రంగా, నక్షత్ర మండలం వర్తులాకారంలో పరిభ్రమిస్తుంది. ఇది భూభ్రమణం వల్ల కలుగుతున్న భ్రమ. అలాగే సప్తఋషి మండలం కూడా పరిభ్రమిస్తుంది. ఒక్కొక్కప్పుడు కనిపించదు కూడ. అట్లాగే అరుంధతి కూడ కనిపించదు. అందుచేత మన పూర్వీకులు ఎప్పుడూ స్థిరంగా కనిపించే ధ్రువనక్షత్రాన్ని అరుంధతి అని వ్యవహరించారు. కాని నిజానికి అరుంధతి వసిష్ఠ నక్షత్రం పక్కనే తేజోవంతంగా మినుకు మినుకున ప్రకాశిస్తుంటుంది.



## 3. నందీశ్వరుడు

నంది శివుని వాహనమైన వృషభమని శివునికి అత్యంత ప్రీతిపాత్రుడైన శిష్యుడని. శివగణముల అధిపతి అని, ప్రతి శివాలయమున శివుని ఎదుట కనబడు శివభక్తాగ్రగణ్యుడని తెలియని వారుండరు. ఆ నందీశ్వరుని వివరములు మాత్రం చాల తక్కువ మందికి తెలుసు.

శాంతారామునికి కోపిష్ఠి లక్ష్మణునివలె, శాంత స్వరూపుడైన శంకరునికి ముక్కోపి అయిన నంది ఇష్టుడు, శిష్యుడు మరియు భృత్యుడు. శివగణాలకు నాయకుడు.

ఏ శివాలయానికి వెళ్లినా పరమశివుని ముందుగా నంది కొమ్ములకు తమ ఎడమ చేతి బొటనవ్రేలు చూపుడు వ్రేలు ఆనించి వాటిమధ్యనుంచి మొదట శివదర్శనం చేసుకోవాలి. అలా చేసుకుంటూ 'ఓం హరహర మహాదేవ శంభోశంకర పాహిమాం' అనాలి. ఎందుకిలా చేయాలి అంటే పెద్దలు చెప్పె వివరణ ఏమిటంటే శివుడు రుద్రుడు. ఆయన మూడవ కన్ను తెరిస్తే ఎవరయినా భస్మం అవుతారు. నందివైపు మాత్రం ఆ పరమశివుడు ఎంతకోపం కలిగినా

మూడవ కన్ను తెరిచి చూడడు. కాబట్టి నంది ద్వార చూస్తె ఆ మదనాంతకుడి చూపువల్ల అపాయం కలుగదు. పైగా భక్తులు పెద్దగా హరహరమహాదేవ అంటారు కాబట్టి ఆయన తన భక్తులు వచ్చారు. వాళ్ళకి ఆపద రాకూడదని తనకి కోపం వచ్చియున్నా తమాయించుకుంటాడు.

జగద్రక్షకుడే ఆగ్రహిస్తె ఇక దిక్కెవ్వరు. అమ్మ పార్వతి లేదా భక్తుడు నందీశ్వరుడు. శివుని ప్రియ భక్తుని కధ అద్భుతం.

ఒకానొక కాలమున సాలంకాయ మహామునికి శిలాదుడను కుమారుడు గలిగి గొప్ప శివభక్తుడని పేరు పొందెను. అతనికి చాల కాలము సంతానము కలుగలేదు. వాని భార్య నోచని వ్రతము లేదు. చేయని పూజలేదు. కాని ఆ దంపతుల కోరిక నెరవేరలేదు.

అతడు సంతానము కోరి శివుని గూర్చి ఘోరతపమాచరించెను. ఆహారమును విడిచి అతడు దీర్ఘకాలము జేసిన తపమువలన అతని చర్మము కప్పిన అస్థిపంజరము వలె క్షీణించియు పట్టుదల వీడక తన



తపస్సును సాగించెను. శరీరముపైన పుట్ట యేర్పడినా అతను తన తపస్సు మాన లేదు.

చివరికి గిరిజా సమేతుడై పరమశివుడు అతనికి ప్రత్యక్షమై **ఓ శిలాద మహామునీ! ముందుగా యౌవన దారుఢ్యమైన నీ పూర్వపు రూపం గ్రహించు. నీ తపస్సు నాకు ప్రీతి కలిగించింది. నీకు ప్రతిగ నీకు ప్రీతి కలిగించే వరం కోరుకో, తప్పక తీరుస్తాను** అన్నాడు.

పార్వతీ సమేతుడైన శంకరుని చూచి అతను ఆనందం పట్టలేక **ఓ మహాదేవా! మీ ఆది దంపతులని చూచిన వారికి ఇక ఏ కోరిక ఉంటుంది? అయినా నీవు స్వయంగా కోరుకోమంటున్నావు గదా. ఓ ప్రభూ! నీకు పరమ భక్తుడు, అయోనిజుడు, దీర్ఘాయువు, నీతోబాటు నీ శిష్యునిగా పూజలంద గలుగు మహనీయుని పుత్రునిగా నొసంగ గోరెదను,** అన్నాడు.

భక్తుల ఏ కోరికకైనా పరమ సంతోషంగా తీర్చే పరమ శివుడు **ఓ శిలాదా! నీకు బ్రహ్మ సంతాన భాగ్యం వ్రాయలేదు. అయినా నీ తపోదీక్షతో నాకు బ్రహ్మ వ్రాతనే మార్పించవలె**



**ననిపించు చున్నది. కాని నీకు ఎన్నడు ప్రాప్తించునో నీకర్మ దోషము ననుసరించి యుండును** అని జెప్పి అంతర్ధాన మయ్యెను.

ఆ తరువాత గూడ చాలకాలము తన కోరిక నెరవేరనందున ఒక గొప్ప యజ్ఞము జేసి పరమేశ్వరునికి తిరిగి తనమొర తెలుప దలచి ఆ యజ్ఞమునకై అగ్ని గుండమును త్రవ్వుచుండగా అందుండి మెరుపుతీగ వంటి సుందరుడైన బాలుడు కనిపించెను.

పరమ సంతోషముతో ఆ బాలుని ఎత్తుకొని పోయి తన భార్యకిచ్చి **వీడు మనకు శివుని వరప్రసాదమున జనించిన బిడ్డ మన జన్మ సఫలమయింది** అని తమ పురోహితులను రావించి నామకరణమును జేయబోగా అశరీర వాణి **ఓ శిలాదుడా! ఈ బిడ్డ మీకేగాక శివభక్తకోటికి ఆనందం కలుగజేస్తాడు. ఇతనిని తాకని వానికి శివదర్శన ఫలితమే కలుగదు. ఇట్లు అందరికీ ఆనందము గలుగజేయు వీనికి నందుడు అను నామము తగినది** అని జెప్పెను. శిలాదుడునూ అతనిని నందుడు అని పిలిచి గారాబముగా పెంచెను.



ఆ బాలునికి అన్నప్రాసన, అక్షరాభ్యాసము, ఉపనయనము మొదలైన కార్యక్రమములన్నీ యధావిధిని తగు సమయమున జరిపి ఒక సద్గురువు వద్ద వేదాధ్యయనమునకు జేర్పించెను. ఏక సంధగ్రాహియైన నందుడు అచిరకాలములోనే వేదములను నేర్చి గురువునకు అమితాశ్చర్యం కలిగించాడు.

ఒకరోజు జరిగినది, జరుగుచున్నది, జరుగబోవునది జెప్పగల మిత్రావరుణుడను మహాఋషి శిలాదుని చూడవచ్చాడు. శిలాదుడు నందుని ఆ ఋషికి మ్రొక్కించి వాని భవిష్యద్వర్తమానములు జెప్పవలసినదని కోరాడు. దానికా ముని **ఓయీ! విచారించకుము. ఈశ్వరుని లీలలు తెలియుట అసాధ్యము. కానీ శాస్త్రమునకు తోచినంతవరకు ఇతడు దీర్ఘాయువుకాడు, ఆపైన అంతా ఈశ్వరేచ్ఛ** అని నందిని ఆశీర్వదించి తన దారిన తను బోయెను.

ఆ సంగతి విని దుఃఖించుచున్న తండ్రిని జూచి నందుడు **తండ్రీ నీ విచారమునకు కారణమేమి?** అని అడిగాడు. దానికి శిలాదుడు **ఓ కుమారా! ఆకలిలేని రోగికి**

మృష్టాన్న భోజనం వలె ఆయుర్దాయం లేని బిడ్డడుంటే అష్టైశ్వర్యాలు నిరుపయోగం కదా ఇన్ని విద్యలు నేర్చిన సుగుణ భూషణుడివైన నీకు అల్పాయువు అని మైత్రావరుణుడు చెప్పిన నాటినుండి నాకు ఏమిజేయుటకు తోచకున్నది. మనకు ఇక ఆ ఈశ్వరుడే గతి అని జెప్పెను. దానికి నందుడు విద్యల బృహస్పతియైన వానిని మిక్కిలి ధనవంతుని చక్కటి ఆరోగ్యవంతుని కూడా తన ఇష్టానుసారం మ్రింగ గలిగిందే కదా ఆ మృత్యువు. దానిని జయించిన ఆ మృత్యుంజయుడు శివునే ప్రార్థించిన మంచిది గదా? అని కేదారంబునకు బోయి పరమేశ్వరుని గూర్చి తపము జేయసాగెను.

ఆ తపోశక్తిచే కైలాసము కూడా జ్వలించుచున్నట్లయిన పిమ్మట పార్వతీ పరమేశ్వరులు నందిని జేరి, ఓ నందీ! ఇంత పిన్న వయస్సులో నీకీ దీక్ష ఏల? నీకు వలసిన వరమేమి? అని ప్రశ్నించారు. దానికాతడు ఓ ఉమామహేశులారా మీ దర్శన భాగ్యమున నా జీవితము ధన్యమైనది. రుచిలేని ఫలము యెంత పెద్దదైనను ఉపయోగము లేదుకదా. కాని నా తల్లిదండ్రుల దుఃఖము



చూడలేకున్నాను. నాకు అల్పాయువని మిత్రావరుణులు చెప్పిన నాటినుండి వారి దుఃఖము వర్ణనాతీతము. వారి కోర్కె నేను దీర్ఘాయువుకల వాడనగుట. నా కోర్కె నీప్రియభక్తుడనయి నీ సన్నిధానమున నిత్యమూ నిన్ను సేవించుచు, నీ వాహనమై మీ పురాణదంపతులను నాపై మోయుచూ మీకు వలసినచోటకు తీసికొనిపోయి మిమ్మల్ని దర్శించు పుణ్యాత్ములను నేనునూ దర్శించి నా జీవితము ధన్యము చేసికొనుట. దయయుంచి నా కోరిక మన్నింపుము అని వేడెను.

దానికి గరళకంఠుడు ఓ నందుడా! నీవు నందీశ్వరునిగా ప్రఖ్యాతి గాంచి, నా ప్రియ శిష్యుడవై కైలాసమున శాశ్వత వాసయోగ్యత పొందితివి. నీ తల్లిదండ్రులకు నీ జన్మచే శాశ్వత కైవల్యము దక్కినది. ఐదుతరముల నీ పెద్దలందరు పుణ్యలోకములు పొందెదరు అని దీవించెను. అప్పుడు గంగ శివునాజ్ఞచే శివజటాజూటమును వీడి నందిపై ప్రవహించి త్రిస్రోత్ర, జటోదక, స్వర్ణోదక, జంబు, వృషధ్వజ అను ఐదు పాయలై



మహావేగమున ప్రవహించు నదులై జపేశ్వర సమీపమున ప్రవహించి ప్రజలకు స్నాన మాత్రముననే పాపముక్తినిచ్చు గొప్పశక్తిగలవై యుండెను. (ఆ నదులు ప్రవహించు ప్రదేశమే నేటి పంజాబ్)

పిమ్మట నందీశ్వరుడు పార్వతీ పరమేశ్వరులతో కైలాసమును జేరెను. అంత కైలాసవాసియైన నందీశ్వరునికి గణాధిపత్యమునీయదలచి ఉమామహేశులు బ్రహ్మ, విష్ణు, దేవేంద్రులను, మహామునులను శివగణములను రావించి నందీశ్వరునకు వివాహము చేసి గణాధిపత్యమునీయు ఆలోచన దెలిపిరి.

సభాసదులందరూ ఆ యాలోచన మెచ్చుకొనిరి. అంతట గొప్ప సౌందర్యవతి, సుగుణాల ఖని మరుత్తుల పుత్రిక అయిన సుకీర్తి ఆతనికి తగిన కన్యయని నిశ్చయించిరి.

మరుత్తు స్వయంగా కన్యాదానం చేసి తన జన్మ తరించిందని భావించాడు. ఐదు రోజుల వివాహం నభూతో నభవిష్యతి అన్నట్లు జరిగింది. ఆ తరువాత నందీశ్వరునికి



వైభవంగా గణాధిపత్యం ఇచ్చి పట్టాభిషేకం జరిపారు పార్వతీ పరమేశ్వరులు.

నంది వారికి ఆంతరంగిక ద్వార పాలకునిగా గొప్ప కీర్తి గడించాడు. శివపార్వతులు యెక్కడికైనా వెళ్ళగోరితే నంది వెంటనేబలిష్ఠమైన గొప్ప వృషభమై శివపార్వతుల నిద్దరినీ అవలీలగా అశ్వముకంటె గొప్ప వేగముతో వారిని తీసుకొని పోవును. ఆ స్థలము చేరగనే తిరిగి నందీశ్వరుడై వారిని సేవించును. అట్టి ఆ నందీశ్వరుని పెక్కు గాధలు శివభక్తుల కర్ణపేయములు.

రావణుడు గొప్ప శివభక్తుడు. పులస్త్య బ్రహ్మకు స్వయంగా మనుమడు. కైకసి కుమారుడు. బ్రహ్మ వరప్రసాదియై కుబేరుని లంకానగరమునుండి తరిమివేసి దానిని ఆక్రమించినవాడు. శివుని మెప్పించి ఆత్మలింగం పొందిన వాడు. నిత్యం కోటిలింగాలనభిషేకించేవాడు. అతనికి వరగర్వంతో శివభృత్యులపై చిన్నచూపు ఉండేది.

అతను ఒకానొక సమయమున పుష్పక విమానంలో వెళ్తూ కైలాసం దగ్గర ఆగి శివుని చూచిపోదామని వచ్చాడు.

నందీశ్వరుడు ఓ రావణా! పరమశివుడు ఏకాంతంలో సతీ సమేతుడై ఉన్నాడు. వారి ఏకాంతం భంగ పరచ రాదు అని మర్యాదగా చెప్పాడు. దానికి రావణుడాగ్రహించి నీకంటే గొప్ప వాళ్ళని ఎలా మన్నించాలో తెలియదు నిన్ను శివుడు ఎలా వుండనిచ్చాడురా ఇక్కడ అన్నాడు.

దానికి నంది వచ్చిన కోపాన్ని దిగమ్రింగుకొని కోపంగా ముఖం ఎఱ్ఱబడి గుడ్లు పెద్దవి చేసి చూస్తుండి పోయాడు. దానికి రావణుడు అహంకరించి పకపక నవ్వి "కోతిముఖం వాడా నువు శివుడి ద్వారపాలకుడుగా ఉండతగవు" అన్నాడు.

ఇక నందీశ్వరుని కోపం ఆగలేదు. పళ్ళు పటపట కొరుకుతూ ఓరీ! నీచుడా ఎంత పొగరుబట్టి వున్నావురా! నన్ను కోతి అంటావా నీకు ఆ కోతులే నాశనం కలిగిస్తాయి. నామాట తథ్యం ఇది శివునిపై ఆన అన్నాడు. దానికి రావణుడు అహంకరించి ఛీ నీతో నాకు పనేమిటి అని అక్కడినుంచి వెళ్ళి పోయాడు.

ఆ విధంగా నందీశ్వరుని శాపమే రావణుడి పాపమై వాణ్ణి అంతం చేసింది.



నందీశ్వరుడు గజాసుర సంహారంలో కూడా ప్రధాన పాత్ర పోషిస్తాడు. గజాసురుని ఘోర తపస్సుకి మెచ్చి శివుడు ప్రత్యక్షమై ఏం వరం కావాలో కోరుకొమ్మంటే ఓ ప్రభూ! నీవు సదా నా ఉదరంలో నివసించమని కోరాడు. శివుని గానక శైలజ చింతించి మహా విష్ణు సహాయం కోరింది. విష్ణుమూర్తి దివ్య దృష్టిచే జరిగిన సంగతి గ్రహించి ఆమెను ఓదార్చి బ్రహ్మ దేవేంద్రాది దేవతలను తోడు తీసుకుని నందిని డూడూ బసవని, మేళం వాయించే వారిగా దేవతలను తయారు చేశాడు. నంది తన స్వామిని చూస్తాననే సంతోషంతో గొప్ప నృత్యం చేశాడు. ఆనందం కలిగి సంతోషించిన గజాసురుడు నేనెన్నడు ఇటువంటి గంగిరెద్దు నాట్యం చూడలేదు. ఇది అద్భుతం ఒక ఎద్దు ఇంత బాగా నృత్యం చేస్తుందంటే నమ్మలేక పోతున్నాను నాకు చాలా ఆనందం కలిగింది మీకు ఏదైనా వరం ఇస్తాను కోరుకోండి అన్నాడు.

దానికి శ్రీకాంతుడు వెంటనే నేను హరిని, హరుని కోసం గిరిజ దుఃఖిస్తున్నది, ఆది దంపతులను వేరుజేసి



ఎందుకు పాపాన్ని మూటగట్టుకుంటావు. శంకరుని ఇచ్చిన మేము తృప్తి పడెదము అనెను. నిర్ఘాంతపోయిన గజాసురుడు శ్రీహరి మాయ నెరింగి చేయునది లేక ఓ దయళూ! పరమ శివా! ఆలయంలోని దైవ ప్రసాదం అంతా తనే తినాలనుకునే మూర్ఖుడిలా ప్రవర్తించి మీకు పార్వతీ దేవికి తీరని దుఃఖం కలిగించాను. దానికి పరిహారంగా ఆమెకు పుత్రానందం కలిగించాలని, నేను చేసిన ఘోరం మరచి ముల్లోకాలూ నా శిరసును పూజించే వరం ప్రసాదించు నీ నందీశ్వరుని పురమాయించి నా వుదరం చీల్పించి నీవు బయటకు విచ్చేయి అన్నాడు.

వెంటనే నందీశ్వరుడు మహా వేగంతో విజృంభించి గజాసురుని కడుపు చీల్చి శివుని బయటకు రప్పించి తన సహజ రూపం ధరించి ప్రభూ! నీ భక్తుని వధించి నందుకు క్షమించు. పెద్దలు శ్రీహరి మొదలైన వారి ఆజ్ఞ నిర్వర్తించాను. శివభక్తులను చంపిన వారికి కోటి జన్మల వరకు ఆ పాపం వెంటాడు తుందని పెద్దలంటారు. నన్ను పాప విముక్తుడిని చేయుము అని వేడి అదే విధంగా శివానుగ్రహం పొంది,



సంతోషించాడు. అందుకనే నందీశ్వరుడు అందరి ఆరాధ్యుడయ్యాడు.

ఉ॥ నందిని తాకి, శృంగముల నాణ్యముగా తమ వ్రేళ్ళనుంచి ఆ
నందము మీర ఈశ్వరుని నామము బల్కుచు వాటి మధ్య, తా
నందరి తండ్రియైన నిటలాక్షుని జూడరె "ఓం హరంచు" మీ
కందరి కబ్బు మోక్షమిది అనృత వాక్యము కాదు నమ్ముడీ

## 4. కాల భైరవుడు

సృష్టి ఆదిలో త్రిమూర్తులు వారి వారి కర్తవ్యములు అనగా బ్రహ్మ సృష్టిని, విష్ణువు స్థితి (సంరక్షణ)ని, శంకరుడు లయము (అంతము) అను బాధ్యతలు నెరవేర్చుచుండిరి. బ్రహ్మ చేయు పని కన్నులకు కనపడుచుండగా తక్కిన వారి పని గూఢముగా యుండెడిది. అనగా అది జీవి కర్మలను బట్టి పరిస్థితిని బట్టి యుండెడిది.

ఒక కార్యాలయములో యజమాని పని కనబడదు. చిన్న సేవకుని పని కనబడుతుంది. అంత మాత్రాన యజమాని సోమరిపోతు అని అనకూడదు. అదే విధంగా తన ఒక్కడి పని కనబడుతుండుటచే కాబోలు బ్రహ్మ **సృష్టికర్తను విధాతను ఘటనా ఘటన సమర్థుడను అయిన నేనే పరబ్రహ్మను. మీరు నా అధీనంలో పనిచేయాలి** అన్నాడు.

విష్ణుమూర్తి **ఓ బ్రహ్మా! నీవు నా నాభి కమలంనుంచి పుట్టినవాడవు. నేనే పరబ్రహ్మను కానప్పుడు నీవెట్లా అవుతావ**న్నాడు.



పరమేశ్వరుడు **ఓ బ్రహ్మా! పరదేవత నన్ను వరించి నా అర్థభాగమయినందున నేను పరబ్రహ్మ యొక్క లయ రూపుడను. నానుంచి ఉద్భవించిన శ్రీమన్నారాయణుని నాభి కమలం నుండి పుట్టిన నీవు బ్రహ్మావు విధాతవు పరబ్రహ్మావు కాదు,** అన్నాడు.

మనందరికీ ప్రమాణమైన వేదముల నడుగుదాం అని, అదే విధంగా మహాదేవుడు వేదాలను ప్రశ్నించాడు.

ఋగ్వేదము **ఓ బ్రహ్మా, విష్ణుదేవులారా! సకల జగములకు ఆధార భూతుడైన పరమ శివుడే పరబ్రహ్మ స్వరూపము** అని చెప్పింది.

యజుర్వేదము **ఓ బ్రహ్మా! విష్ణూ! ప్రపంచమున యజ్ఞ యాగాది కర్మలకు యోగధ్యానములకు ఆధార భూతుడైన పరబ్రహ్మ స్వరూపము శివుడే. ఇది నిజం** అని చెప్పింది.

సామవేదం **ఈ విశ్వమంతటికీ, ధ్యాన నిష్ఠాది సకల యోగాభ్యాసములకు ఆధారమైన శంకరుడే నిస్సందేహంగా పరబ్రహ్మ స్వరూపము** అని చెప్పింది.



అధర్వణ వేదం **ఓ పరమేష్ఠి విష్ణు దేవులారా! మీరు సకల భువనాల కాధారం పరమ శివుడు. యోగ, ధ్యాన, సమాధుల వలన సకల దుఃఖములు హరింప జేయగల నిత్యానందము నీయగల పరదేవతా సమేతుడైన పరమ శివుడు మాత్రమే పరబ్రహ్మ. ఇందు సందేహం లేదు** అన్నది.

ఇవి ఇట్లుండగా ఈ వేదములకు, ఆధార భూతమైన ఓంకారము కూడా **ఓ బ్రహ్మా! విష్ణు! పరబ్రహ్మ స్వరూపమే పరదేవతా సమేతుడైన శివుడు. శివశక్తి గలిగి యుండుటచే పరబ్రహ్మ స్వరూపమునే శివ అనియు శివుడనియు పిలువబడుచున్నది. పరమేశ్వరుడు పరదేవత లోకములలో నిరంతరము విహరించి సన్మార్గుల దుఃఖము తెలుసుకొని తీర్చుట జేతనే ప్రపంచమున సుఖ శాంతులు వెలయు చున్నవి,** అని చెప్పింది.

కాని బ్రహ్మ మాత్రము **వీరంతా అసత్యము జెప్పు చున్నారు. నేనే సృష్టికర్తను విధాతను పరబ్రహ్మను** అని మొండిగా వాదించాడు. ఈశ్వరుడు రౌద్రరూపంతో క్రోధాన్ని ఆపుకోలేక భయంకరంగా హూంకరించాడు. ఆ



హూంకారము నుండి రక్తవర్ణమైన కన్నులు, ఎఱ్ఱని మందారముల వంటి కేశములు, కర్పూరము వంటి దేహచ్ఛాయ, తేజోమయమైన స్వరూపము నెన్నుదుటలో మూడవకన్నుతో ఆజానుబాహుడును, ఆకాశమంత ఎత్తువున్నవాడో అనిపించు పొడగిరియు, అనేక బాహువులతో త్రిశూలము, గద వంటి వివిధ ఆయుధములు కలవాడునూ, ఒకచేత భయంకరంగా మ్రోగే డమరుకం గలవాడు ప్రళయ నాట్యం చేస్తున్నవాడునూ దశదిశల వ్యాపించిన రణగొణ ధ్వనితో చూస్తేనే వణుకు పుట్టించు కాలభైరవుడు వెలువడి **'తండ్రీ! పరమేశ్వరా! నా జన్మకు హేతువేమి?** అని అడిగాడు.

అందుకు ముక్కంటి **నాయనా కాలభైరవా! జగత్ సృష్టి అను పవిత్ర బాధ్యత జేబట్టిన ఈ బ్రహ్మ విధాత అయినవాడు. కానీ తమోగుణ వర్తనుడై స్వార్థంతో అసత్యం పలుకుతున్నాడు. ఇట్టి మానసిక స్థితిలో ఇతను సృష్టించిన జీవులంతా రాక్షసులై తమోగుణ అహంకారులై జగద్విలయం కలిగిస్తారు. ఇంతటితో ఈ అన్యాయం ఆపాలి. నాలుగు తలలతో నాలుగు వేదాలు పలికే ఈ బ్రహ్మ ఐదవ తలతో**

**మాత్రం నరుల వోలె అబద్ధం అత్యాశ అహంకారం కలిగి వున్నాడు. నీవు ఆ తలని నరికి లోక కళ్యాణం చేయి. బ్రహ్మ చతుర్ముఖుడై ప్రతిముఖంతోను వేదం పలుకుతూ సజ్జనులను సృష్టిస్తాడు** అన్నాడు.

కాలభైరవుడు తన కుడి చేతి చిటికిన వ్రేలి గోటితో బ్రహ్మయొక్క నడిమి శిరస్సు గిల్లివేసి ఆ తలను ఉత్తర దిక్కుగా విసిరి వేశాడు. ఆ స్థలము బ్రహ్మ కపాలమను పేర ప్రసిద్ధి చెంది పూజనీయమైన పుణ్యస్థలమైనది. శివుని హూంకార కాలములోపల జనించిన ఆ భైరవుడు కాలభైరవుడై శివునాజ్ఞ నిర్వర్తించి శివునకు పరమ ప్రీతి పాత్రుడైన అంగరక్షకుడై పూజలందుకున్నాడు.

చతుర్ముఖుడైన బ్రహ్మ పరిపరివిధముల పరమేశ్వరుని ప్రార్థించి తన లోకమునకు బోయెను. విష్ణుమూర్తి కూడ పరమశివుని నుతించి ఆయన వీడ్కోలు గొని వైకుంఠము జేరెను.

అప్పుడు ఈశ్వరుడు కాలభైరవుని జూచి **కుమారా! బ్రహ్మ తలనరుకుటచే నీకు బ్రహ్మహత్యా పాతకము**



**జుట్టుకొని నిన్ను వెంటాడు చుండును. దుష్కృత్యముల ఫలములు మన నీడ వలె మన వెంటనే వుండి సమయము దొరకగానే కబళించును. మహాత్ములకైననూ కర్మఫల మనుభవించక తప్పదు. నీవు చేసిన బ్రహ్మ శిరచ్ఛేదన బ్రహ్మహత్యా పాతకమై నిన్ను వెంటాడుచుండును.**

**నీవు కాపాలికా వ్రతము నాచరించి ముల్లోకములలోని పుణ్యనదులన్నిటిలో స్నానమాచరించుము. తుట్టతుదకు బ్రహ్మ శిరస్సు పడిన చోట కాశీ అనుమహా పుణ్యక్షేత్రము పవిత్ర గంగానది ఒడ్డున వెలిసిన చోట చేరుము. అచ్చట నేను విశ్వేశ్వరునిగా, పార్వతి అన్నపూర్ణగా వెలిసి యున్నందున దుర్భిక్షమనునది లేని శివక్షేత్రమై యున్నది.**

**నీవు ఆ క్షేత్రపాలకుడవై నన్ను సేవించుచుండుము. అందుచేత ఆ బ్రహ్మహత్య నిన్ను తాకదుగాని నీడలా నీవెంటనే యుండును. ఎట్టిటి నేత్రములు, ఎట్టిటి వస్త్రములు, ఎట్టిటి దేహచ్ఛాయ, ఎట్టిటి జడకట్టిన వెంట్రుకలు, భయంకరమైన కోరలు, క్రోధ ద్వేష భావాలు గల వికృత రూపంతో ఆ బ్రహ్మహత్య నీవెంటనే నీడలా**



**వస్తుంటుంది. కాని నా ఆజ్ఞచే నిన్ను తాకదు. నిన్ను పట్టిన ఆ బ్రహ్మహత్య చివరికి నీ యాత్రానంతరం కాశీ చేరగానే భస్మమైపోతుంది.** ఈశ్వరుడు ఇట్లా చెప్పగా కాలభైరవుడు తీర్థయాత్రలు చేయుటకు వెడలిపోయెను.

అంతట శ్రీమన్నారాయణుడు లోకోపకారార్థమై నారదుని బిలిచి **నీవు త్రిలోక పూజితుడవు కామ గమనం గలవాడివగుటచే ముందుగా బోయి త్రిలోక వాసులకు కాలభైరవుడు ఈశ్వరుని వర పుత్రుడనియు, బ్రహ్మ హత్యాదోష నివారణార్థమై కాపాలికా వ్రతము చేయుచూ ముల్లోకములందలి పుణ్య తీర్థములను దర్శించి స్నానమాచరించి ముష్టి యాచించుచు శివభక్తుల గృహములకు వచ్చుననియు ఆ కాపాలికా వ్రతునకు ధర్మము చేయునప్పుడు తెలిసిగాని, తెలియక గాని చేయు ధర్మము గుప్తముగా వుండవలెననియు ఏమాత్రము దూషించరాదనియు ఈ నియమములను యుల్లంఘించిన వారు కాలభైరవుడు పొందిన బ్రహ్మహత్యా దోషములో భాగస్థుడై పాపము పంచుకొందురనియు చాటి రమ్మని** చెప్పెను.



ఇట్లు కాపాలికా వ్రత దీక్షతో పదునాల్గు భువనాలు కూడా తిరిగి బ్రహ్మహత్య ఇంకా వెన్నంటగా కాలభైరవుడు వైకుంఠం చేరాడు. శ్రీలక్ష్మి సమేతుడైన నారాయణుడు అతనికి ఎదురెళ్ళి ఘనస్వాగతం చెప్పి గౌరవించాడు. అప్పుడు కాలభైరవుడు **ఓ మహానుభావా! ముల్లోకములు పదునాల్గు భవనములు తిరిగినా ఈ పాపం నన్ను వీడకున్నది. నాకు ఏ ఆలోచన తోచుటలేదు. తగిన ఉపాయం చెప్పవలసింది** అని అభ్యర్థించాడు.

దానికి మహావిష్ణువు కాలభైరవుని పుట్టుక వివరాలెరింగించి **ఓయీ! ప్రపంచంలో పాతకములు, ఉపపాతకములు, మహాపాతకములని మూడు రకములైన పాపములు జరుగుచున్నవి. ఇందు ఉపపాతకములు నరులు జీవన గమనంలో తెలిసికొన్ని తెలియక కొన్ని చేస్తారు. ఒక హంతకునికి ఆశ్రయమిచ్చుట గాని, వాని సేదదీర్చుటగాని అటువంటి పాపములే. ఇందులో కొన్ని పాపములు మన గ్రహచార దోషంవల్ల జరుగుతాయి. ఒకడు ఇంకొకని కొట్టుటకు రాయి విసిరితే అది గురి తప్పి ఏమాత్రం సంబంధం లేని ఇంకొకడికి తగిలి గాయపరచుట ఈ**

**గ్రహచార దోషం వలన జరుగుతుంది.**

**గ్రహములనుకూలముగా లేనప్పుడు చేయవలసిన పనులు చేయకుండుట, చేయరాని పనులు చేయుట జరుగును. మంచి చెప్పువారు చెడ్డవారు గాను చెడు చెప్పువారు శ్రేయోభిలాషులుగాను స్ఫురింతురు. జ్ఞాపకశక్తి నశిస్తుంది. నీవు కూడ అదే విధంగా ప్రవర్తిస్తున్నావు. పరమ శివుడు స్వయంగా చెప్పిన విషయాలు విస్మరించి వ్యర్థంగా కాలయాపన చేస్తున్నావు. నీకు ఇంతకు ముందు ఈశ్వరుడు కాశీ క్షేత్రం దర్శించమంటే ఎక్కడెక్కడో తిరుగుతూ ఎందుకు వ్యధ చెందుతున్నావు. కాశీ వంటి క్షేత్రము శ్రీరామ రామ రామ యను తారక మంత్రముకంటే గొప్ప జ్ఞానం వుంటాయా. బ్రహ్మ శిరస్సు ఖండించుటకు పుట్టిన నువ్వు ఈ విధంగా బ్రహ్మహత్యా పాతకంచే పీడించబడుట బాగుగా లేదు** అన్నాడు.

హుటాహుటిగా కాలభైరవుడు అక్కడ నుంచి కాశీపురి చేరి పవిత్ర గంగానదిలో స్నానం చేసి విశ్వనాధుని అన్నపూర్ణలను సందర్శించి విశ్వనాధుని ఆనతి చొప్పున కాపాలికా వ్రతం పూర్తిచేసి కాశీపురి క్షేత్ర పాలకుడై



కాశీపురిలో తనువు వీడు వారికి రామనామ తారక మంత్రం కుడి చెవిలో వారికి మాత్రమే వినపడునట్లు చెప్పి ఆ మంత్రంలో ఒక్క రామ అనియైన తముకూడ అనువారికి కైవల్యం ఇప్పిస్తూ కాశీనగరమే కడపటి గమ్యం అను ప్రసిద్ధిని నిలిపాడు.

అనంతరం బ్రహ్మహత్య దహించబడిన రూపంగలదై పరమ శివుని శరణన్నది. అంత విశ్వనాధుడు **ఓ బ్రహ్మహత్యా! నీవు సూక్ష్మ రూపమున జూదరులు, జూదరులు, దైవ నిందాపరులు, ఆచారమును శక్తికలిగియు బుద్ధి పూర్వకముగా వదలిన వారిని బట్టి బాధించుము దైవభక్తుల గృహములకు పోకూడదు.**

**కృత, త్రేతా,ద్వాపర యుగములలో నీకు కష్టకాలము కాని రాబోవు కలియుగంలో నీవు పుంజుకుని బల సంపన్నుడవౌతావు** అన్నాడు. తారకమంత్రం ప్రదానం వలన కలిగిన పుణ్యంతో కాలభైరవుడు తెల్లని దేహచ్ఛాయ కలవాడై నాలుగు హస్తములలో డమరుకము, త్రిశూలము, గద పాశము ధరించి సుందర రూపమున క్షేత్ర పాలకునిగా పూజలు పొందాడు.



శని త్రయోదశి రోజున నువ్వుల నూనెతో కాలభైరవుని అభిషేకము జేసి, నారికేళపు నీటితో అభిషేకించి, చిమ్మిలి (నువ్వుల పప్పు బెల్లముతో చేసిన గుండ పదార్థం) నైవేద్యం పెట్టి సద్బ్రాహ్మణ్యులకు శక్తికి తగ్గట్లు అన్నదానం చేయవలెను. ఈ విధంగా తరువాత ఆరు శనివారాలు చేసి సామర్ధ్యం వుంటే ప్రతి శనివారం లేదా కనీసం ఒక్క ఆఖరి శనివారం అన్న శాంతి హోమం చేయించి కాలభైరవుని ఆరాధించినవారు సర్వ వాంఛా ఫలసిద్ధి కలిగి, దోష నివారణమై పౌత్ర, దౌహిత్రుల కళ్యాణములు కూడ వీక్షించగలరనుట నిస్సంశయం.

ఈ కాలభైరవుని చరిత్ర వినిగాని చదివిగాని భక్తి పూర్వకంగా మనస్సున ధ్యానించిన గ్రహదోష నివారణయై కోరికలు నెరవేరుతాయి.

ఉ॥ సత్యము జెప్పలేదనుచు శంభుడు బ్రహ్మకు శిక్ష వేయనై
భృత్యుడు కాలభైరవుని బిల్చివిరించి శిరంబుద్రంపనన్
నిత్యము నీదు ఆజ్ఞోకటె నేతల దాల్తనె నట్లె జేసి తా
నత్యభిమానమున్ గొనెను ఆతడె భైరవుడీశు చూలియై



## 5. శరభసాళ్వావతార చరిత్ర

పూర్వం కృతయుగంలో కశ్యప ప్రజాపతికి దితికి ఇద్దరు అతి దుర్మార్గులైన రాక్షసాంశగల పుత్రులుద్భవించారు. వారిలో హిరణ్యాక్షుడనేవాడు చిన్నవాడు కాని పరమ దుర్మార్గుడు. కంటకుడైవాడు భూదేవినే అపహరించి పారిపోతుంటే శ్రీమన్నారాయణుడు సూకర(పంది) రూపంతో వాడితో తలపడి సంహరించాడు. భూదేవిని తనభార్యగా స్వీకరించాడు.

వాని అన్న హిరణ్యకశిపుడు ఇది విని హరిద్వేషియై, వానినెదిరించుటకు తన బలము చాలదని గ్రహించి బ్రహ్మదేవుని గూర్చి ఘోరతపము నాచరించాడు. ఎముకల గూడై కూడ ఒంటికాలిపై నిలిచి తనకోసం తపస్సు చేస్తున్న వానిని జూచి పరమేష్ఠి పరమానంద భరితుడై వానికి ప్రత్యక్షమై వాని పూర్వపు రూపు ప్రదానం చేసి **నాయనా! ఇంత ఘోర తపస్సు యెందుకు చేస్తున్నావని అడిగాడు. దానికా అసురేంద్రుడు తనకు మృత్యువు కలుగకుండునట్లు వరం ఇమ్మన్నాడు. బ్రహ్మ అది సృష్టి విరుద్ధమని తనావరమీయలేనని ఇంకేదైనా వరం కోరుకో** మన్నాడు.

అప్పుడు హిరణ్యకశిపుడు ఈవిధంగా వరములను కోరుకున్నాడు. ఓ విధాతా! నాకు పగలుగాని రాత్రిగాని, నేలపైగాని ఆకాశంలో గాని, దేవ, నర, రాక్షస, నాగ మొదలైన ఏజాతి వారిచే గాని, ఏ ఆయుధం చేతగాని, ప్రాణమున్నవాటిచే గాని ప్రాణములేని వాటి వాటిచేగాని, పంచభూతముల దేనివల్ల గాని చావురాకుండునట్లు అనుగ్రహింపుము అన్నాడు.

బ్రహ్మ తథాస్తు అని బల్కి అదృశ్యమయ్యాడు. అవలీలగా పదునాల్గు భువనాలు జయించిన ఆ దానవుడు కైలాసమును వదిలిపెట్టి హరి ద్వేషియగుటచే వైకుంఠాన్ని ముట్టడించాడు. శ్రీహరి నారదాది మునులకు శేషతల్పం మీద కనిపిస్తున్నాడు గాని ఆ దుష్టుడికి మాత్రం కనిపించడయ్యె. ఏం చేస్తాడు? పిరికిపంద విష్ణువు నన్నుజూచి పారిపోయాడనుకొని అచ్చటనుండి వెడలిపోయాడు హిరణ్యకశిపుడు.

ఆ రాక్షసుడు బ్రహ్మ కోసం తపస్సు చేస్తున్నప్పుడు అతని భార్య లీలావతి గర్భవతి. ఇంద్రుడు ఆమెను చెరబట్టి ఆ గర్భ విచ్ఛేదన జేయాలని యత్నించినప్పుడు నారదుడు వానిని వారించి ఆమె గర్భమున నున్నది. భాగవతోత్తముడైన ప్రహ్లాదుడని



జెప్పి వారించి ఆ ప్రహ్లాదుడే ఆ రాక్షసుడి మృత్యు కారకుడవుతాడని జెప్పాడు. ప్రహ్లాదుడు తండ్రిని జేరి ముద్దుగా పెరిగి విద్యాభ్యాసానికి గురువుల వద్ద చేరాడు.

ముల్లోకాధిపత్యంతో హిరణ్యకశిపుడు చెలరేగి లోక కంటకుడై సజ్జనులను పీడించ సాగాడు. ప్రహ్లాదుడు గురువులకే హరిలీలలు వినిపిస్తుంటే వారు భయపడి బాలుని తండ్రి కొప్పగించారు. దానవేశ్వరుడు నయాన, భయాన చెప్పినా ప్రహ్లాదుడు హరిభక్తి వీడనన్నాడు.

మాట వినని కొడుకుని జూచి మండిపడి హిరణ్యకశిపుడు చీకటి గదిలో అఘోక్తగా బంధించాడు. కాలకూట సర్పాలతో కరిపించాడు. పర్వతాలమీంచి పడద్రోయించాడు. హరిభక్తి మానమని ఎన్నోవిధాలుగా హింసించాడు. కాని ఫలితం లేక హరి ఎక్కడున్నాడురా అని అడిగాడు. ఇందుగలడందు లేడని సందేహం వలదన్నాడు ప్రహ్లాదుడు. అక్కడ ఉన్న స్తంభాన్ని జూపించి ఈ స్తంభంబున జూపగలవె చక్రిన్ గిక్రిన్ అని వెక్కిరించాడు అసురాగ్రణి.

**నిస్సందేహంగా** అన్నాడు ప్రహ్లాదుడు. ఒక పెద్దగద



తీసుకుని ఆ స్తంభం విరిగేలా మోదాడు దానవుడు. అప్పుడు ఒక అద్భుతం జరిగింది. ఆ స్తంభమునుండి శిరస్సు సింహ రూపము క్రింద సగం నరరూపము గల నరసింహుడు వెలిశాడు. పగలూ రాత్రీ కాని సంధ్యా సమయంలో, ఇంటా బయటకాని గడపపై తనుకూర్చుని తన వడిలో రాక్షసుణ్ణి పడుకోబెట్టుకుని, ఏ ఆయుధముగాని చేతులతో, జీవము ఉండీలేని గోళ్ళతో చీల్చి రక్తపు బొట్టు కారకుండా పీలుస్తూ చంపేశాడు. హిరణ్యకశిపుని వరములన్నీ పాటించి నరసింహ స్వామి రాక్షసుణ్ణి చంపాడు.

అయితే హిరణ్యకశిపుడు చచ్చినా నరసింహుని ఉగ్రం శాంతించలేదు. దేవత లెంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. ప్రహ్లాదుడు స్వామిని స్తోత్రించాడు.

ఓ నరసింహా! అజ్ఞానులై అహంకారులై నా పినతండ్రి, నా తండ్రీ హరిద్వేషముతో నీచేత అంతమయ్యారు. నీవు భక్త వత్సలుడవు. ఆర్తత్రాణ పరాయణుడవు, మత్స్య, కూర్మ, వరాహ రూపములతో దుష్ట రాక్షసులను తుదముట్టించిన అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడవు. నీ ఉగ్రరూపం తట్టుకోలేక నాబోటి నీ భక్తులంతా భయంతో వణికి పోతున్నారు. దేవేంద్రాదులకే



భయం కలిగించే నీ నరసింహరూపం వణుకు పుట్టిస్తుంటే మిగతావారి మాటేమిటి? నీవు కాపాడకున్నచో మాకు దిక్కెవ్వరు? పాహిమాం పాహిమాం అన్నాడు.

అప్పుడు నరసింహుడు శాంతించాడు. కానీ ఇంతలో హిరణ్యకశిపుని సేనాధిపతులంతా నరసింహుని దేవతలను ముట్టడించారు. అప్పుడు నరసింహుడు మళ్ళీ రుద్రుడై చక్రాయుధంతో వాళ్ళ తలలు నరికి విలయ తాండవం చేయసాగాడు. అంతట పరమ శివుడు వీరభద్రుని బిలిచి నాయనా! నీవు శరభ సాళ్వావతారం యెత్తి ఈ నరసింహుని శాంతింపజేయి అన్నాడు.

పరమేశ్వరుని ఆనతిమేరకు వీరభద్రుడు శరభ సాళ్వావతారం ధరించాడు అతిభీకరమైన ఆ శరభ సాళ్వావతారం చూపరులను గడగడ లాడించేట్లుంది. భూమ్యాకాశాలను తాకునట్లున్న ఆ ఆకారం వర్ణించుటకు సాధ్యం కావటం లేదు. ధృడమైన రెండు పాదాలపై నిలుచుని వున్న ఆ శరభునికి బలిష్టమైన రెండు రెక్కలున్నాయి. వజ్రతుల్యమైన వాడి గోళ్ళున్నాయి. వాని నేత్రాలు నిప్పులుకురుస్తున్నట్లున్నాయి. అవి

ప్రకాశిస్తూ మెరుస్తున్నాయి. చతుర్ముఖ గండభేరుండ పక్షి రూపంలో వున్న అట్టి రూపును ముందెన్నడూ ఎవ్వరూ చూడలేదు. ఆ గండభేరుండం రివ్వున ఎగిరి సభామంటపాన్ని మూడుసార్లు ప్రదక్షిణం జేసి తిన్నగా నరసింహుని ముందు వాలింది.

ఆ శరభసాళ్వుని జూచిన ఉగ్రనరసింహుడు సంభ్రమాశ్చర్యాలతో ఇట్లా అన్నాడు. ఈశ్వరపుత్రా! శరభా!

ఇంత రౌద్రాకారం మున్నెన్నడూ నేను జూడలేదు. దేవతలందరూ నా రూపం జూచి తల్లిడిల్లి ప్రహ్లాదునిచే నన్ను ఉపశమింపచేశారు. ఇక నీ రూపం భరించగలరా? ఇంత భయంకరమైన ఈ రూపం ఎందుకు ధరించావు. నీవు ఏ రాక్షసుని వధించవలసి యున్నది? సత్వరమెరింగించుము అన్నాడు. అంత దేవేంద్రాది దేవతలు బ్రహ్మ పరమేశ్వరుడు అక్కడికొచ్చి అహోశరభా! లోకాలని కాపాడ వలసిన శ్రీమహావిష్ణువు, వీరభద్రుడు ఇలా ఒకరిమీద ఒకరు పోటీపడినట్లు ప్రపంచాన్ని భయంతో వణికిస్తున్నారు ఇదేం న్యాయం? లోకపాలకులకిది తగనిపనికదా!



ఓ నరసింహా! లోకకంటకుడు హిరణ్యకశిపుడు నశించాడు. నీకు దానవకులాన్ని నిర్మూలించే వ్రతమేమీ లేదు కద. నీ చక్రాయుధంచే నశించిన వారిలో మిగిలిన దైత్యులను రసాతలమునకు బోయి స్థిరపడి లోకపీడమాని జీవించమని చెప్పవచ్చునుగదా. ఓ వీరభద్రా! సంభ్రమాశ్చర్యాలలో ముంచి నరసింహుని ఉగ్రరూపమును శాంతింప చేయదలచిన నీయత్నం ఫలించినది. నరసింహుడు ఇప్పుడు ఆదిలక్ష్మిని జేబట్టి భయార్తులను కాపాడి ప్రతివారికీ ఇలవేలుపవుతాడు. తలచుకుంటే కరుణించే ఆ స్వామి పెక్కుచోట్ల వెలసి ఇక్కట్లు తీరుస్తాడు అని జెప్పి దేవతలతో పాటు వారి వారి నెలవులకు బోయారు. శరభుడు వీరభద్రుడై నరసింహునికి నమస్కరించి సెలవు తీసుకున్నాడు.

ప్రహ్లాదుని శోణితపుర సింహాసనాధీశుని జేసి ఆచంద్రతారార్కము కీర్తిగలిగి యుండమని దీవించి పెక్కు వరంబులిచ్చి ఈ శరభ సాళ్వుని కథ విన్న వారికి శత్రుభయం, పిడుగు పాట్ల వల్ల భయం అపమృత్యు భయం లేకుండునట్లు ఆశీర్వదించి ఆదిలక్ష్మి నరసింహులు భక్తులను సంతోషపరచారు.



మం॥ వెలసెన్ రౌద్రుడు నారసింహుడట జంపెన్
దానవున్, అంతటన్
నిలుపన్ ఆతని జృంభణమ్ము ధరపై నిశ్చేష్టునిన్
జేసె తా
నలరారెన్ శరభుండు, అక్కజముతో ఆరూపమున్
జూచి, ఆ
నళినీకాంతుడు శాంతుడయ్యె వెరపున్
నాకీయమేలాయనెన్



## త్రిపురాసురుల చరిత్ర

తారకాసురుని కుమారస్వామి వధించిన తరువాత అతని భార్య పసికందులైన తన పుత్రులను తీసుకుని శుక్రాచార్యుని శరణు కోరింది. శుక్రాచార్యుడు వారికి రసాతలంలో రక్షణ కల్పించాడు.

ఆమె ముగ్గురు కుమారులు తారకాక్షుడు, కమలాక్షుడు, విద్యున్మాలి అని పిలువబడి శుక్రాచార్యులను దైవంలా భావించి సకల విద్యలను అభ్యసించారు. వారికి యుక్త వయస్సు వచ్చాక ఆమె నాయనా! మీ తండ్రిగారిని దేవతలు కుమారస్వామి సహాయంతో చంపించారు. మనం అప్పుడు అనాథలం. అంతా భరించాం. ఇప్పుడు మీకు యుక్తవయస్సు వచ్చింది. మీతండ్రి ఆత్మశాంతించుటకు మీరు గొప్ప తపస్సుచేసి వరములు పొంది దేవతలమీద మీ ప్రతీకారం తీర్చుకోవాలి అని చెప్పింది.

ఆ ముగ్గురు అసురులు తమతండ్రివలె బ్రహ్మ గూర్చి ఘోరతపస్సు చేయటం మొదలుబెట్టారు. శరీరాలు ఎముకల గూడులా అయిపోయినా వారు పట్టువదలక భగభగ మండే

అగ్నిలో ఒకడు, కుడి కాలి బ్రొటనవేలిపై మాత్రమే నిలబడి ఒకడు, గాలిని కూడ నిరోధించి ఒకడు ఘోరతపస్సు చేశారు. సర్వసృష్టికర్త అయిన బ్రహ్మ ఇక చేయునదిలేక వారికి ఏక కాలంలో ప్రత్యక్షమై ఓ దానవులారా! మీ తపోశక్తిచేత లోకాలనెందుకు దహిస్తున్నారు? మీకేం కావాలి కోరుకోండి ఈ తపస్సు చాలించండి ముందు మీ పూర్వపు యౌవన రూపం గ్రహించండి. ఆలోచించి మీకు కావలసినది కోరుకోండి అన్నాడు.

అప్పుడు ఆ ముగ్గురు ఏక కంఠంతో ఇట్లా అన్నారు. ఓ పరమేష్ఠీ! మాముగ్గురికీ అజేయమైన మూడు పురములను ప్రసాదింపుము. వాటికి మేము కోరుకొను ప్రదేశమునకు ఎగిరిపోగల శక్తి కలిగియుండవలెను. అవి ఒకటి స్వర్ణము, ఒకటి రజితము ఒకటి ఇనుముచే నిర్మింపబడి అభేధ్యమై యుండవలెను. మా ఇచ్చవచ్చిన చోటికి అవి ఎగిరిపోగలిగి యుండవలెను. మాకు గొప్ప ఈశ్వరభక్తి కలిగి విద్య, తేజము, బలము, ఐశ్వర్యము, ధైర్యము కలుగునట్లు జేయుము.



ఇక అతి ముఖ్యమైనది మా మరణము. మాకు ఒక్కని చేతనే ఏక కాలమున, ఒకే విధముగా మరణముగావలెను. విల్లుగాని వింటిచే, బాణము గాని బాణముచే, నారిగాని నారి సంధించి మమ్ముల్ని చంపాలని కోర్కెలేని వీరునిచే మాత్రమే మాకు మరణం కలుగవలెను. మరేవిధముగా మాకు మరణము సంభవించరాదు అని కోరిరి.

పరమేష్ఠి తథాస్తు అని విశ్వకర్మను రావించి సువర్ణ పురమును తారకాక్షునకు, రజితపురమును కమలాక్షునకు, ఇనుప (అయస్కాంత) పురమును విద్యున్మాలికి తయారు చేసి ఇమ్మని పురమాయించెను. విశ్వకర్మ! తన పనితనము చూపించి విమానముల వలె ఎగిరిపోగల త్రిపురములను నిర్మించెను. ఆ త్రిపురములకు కామగమనము ఆకాశ గమనము కలిగి యున్నవి.

వాటిలో చక్కని ఉద్యానవనములు భవనములు శివాలయములు ఫల పుష్ప సమృద్ధిగల వృక్షములు తటాకములు గల ఆ త్రిపురములు ఇచ్చవచ్చిన వారిమీద వాలి ఊక ఉమ్మడిగా వేలకొలది నర, దేవ గణములను చంపుచు భీభత్సము సృష్టించు చుండెను.



వరబలముచే దేవేంద్రాలు కూడ ఏమీ చేయలేక అశక్తులై చింతించుచుండిరి. వారి మొరలను బ్రహ్మదేవుని వద్ద చెప్పుకొనిరి. బ్రహ్మ వారిని జనార్దనుని వద్దకు తీసికొని వెళ్ళాడు. సంగతి తెలుసుకున్న విష్ణువిలా అన్నాడు. ఓ దేవతలారా! నిత్యము వేదోక్తంగా శివుని ఆరాధించే వారిని, అగ్నికార్యం జేసి తపము దినచర్యగా కలవారిని ఒక్క ఈశ్వరుడే అంతం జేయగలడు. కావున మీరు ముందు ఈ త్రిపురాసుల ఆచారము శివభక్తి చెడగొట్టండి. ఓ బ్రహ్మ నీవు మిధ్యావాదము బోధించు బౌద్ధుని సృష్టించి వానికి నలుగురు శిష్యులను ఏర్పరచుము. వారికి పదహారువేల గ్రంధములున్న బౌద్ధమును గల్పింపుము. ఆ నలుగురూ నలుమూలల వారి మతమును విస్తృతి చేయుదురు. వితండవాదములో ప్రసిద్ధి చెందుతారు.

దాని ప్రభావమున ఆదిలో ఒక పురుషుడు ఒక స్త్రీనుంచి జనించిన వారందరూ ఒకరితో ఒకరు శృంగారము సలుపుట చేతనే మనమందరము యుద్భవించితిమి. కావున ఈ వావి వరుసలు మూర్ఖత్వము. ఈశ్వరుని సృష్టిలోని



నరుడు దప్ప మరే జంతువుకు ఈ వావి వరుసలు లేవు. వాటిని పాటించుట నిష్ప్రయోజనము.

మంచితనముతో అహింసతో సత్య ధర్మములను పాటించిన చాలును. పూజలు వేదాచారములు కర్మలు అనవసరము, అంటారు. అట్టి కర్మ బాహ్యులు క్రమేపి పాపాలు యెక్కువ చేస్తూ నాస్థికులై శివాలయాలను ధ్వంసం చేసే స్థితికి వస్తారు. ఈ త్రిపురాసురుల వద్దకు బౌద్ధుడు వెళ్ళి వారిని కూడా శివారాధన వ్యతిరేకులను చేస్తాడు. అప్పుడు శివుడే ఏదో ఒక ఉపాయంతో వారిని తుదముట్టిస్తాడు అని చెప్పి అందరినీ వారి వారి తావులకు పంపించి వేశాడు.

ఆ తరువాత బుద్ధుడు తన నలుగురు శిష్యులతో త్రిపురాసురులను ఆశ్రయించి వారి పట్టణములలో తన శిష్యుల చేతను, తను స్వయముగా తారకాక్ష, కమలాక్ష, విద్యున్మాలి వద్దకు బోయి తన సిద్ధాంతము వివరించెను. అది వినుటకే అద్భుతముగా వుండి ఆ రాక్షసులను వారి పురజనులను ఆకర్షించి, బౌద్ధమతమును స్వీకరించ దలచారు.

ప్రజలు రాజుననుకరించి స్వేచ్ఛాకాముకులై వావి వరుసలు మాని నీతి బాహ్యులయ్యారు. ప్రతిదినము సభలు జరిపి ఈ విధంగా చెప్పారు. త్రిపుర వాసులైన మహా పండితులారా వేదము మానవులు రచించినవే. ఆ వేదకర్మలలో ఆచరణీయం కానివి చాలా ఉన్నాయి. మనిషి సుఖించటానికే ప్రకృతి స్త్రీ పురుషులను సృష్టించింది. లేనిచో వారు వేర్వేరు అవయవ నిర్మాణం కలిగి ఎందుకు వుంటారు. మనిషి జీవనము సక్రమముగా నడచుటకు ఏర్పరచుకున్న సాంఘిక నియమాలను వేదోక్తం అని చెప్పి వారిని ఆనందంనుండి దూరం చేసి అనవసరమైన వేద ధర్మాలని చెబుతున్నారు.

ఇట్టి బోధలు రాజులను ఆకర్షించి తీరు తాయి కారణం రాజులు కాముకులు. అదే విధంగా ఆ త్రిపురాసురులు బుద్ధునితో గురువర్యా మాకు మీ మతంపై నమ్మకం కలుగుతోంది మాకు మీ మత ధర్మాలు విశదీకరించండి అన్నారు.

అప్పుడు బౌద్ధుడు ఓ త్రిపురాసురులారా ఈ మతం మీ అన్ని మతాలకంటే విలక్షణమైనది. దీనిలో పదహారు



వేల మహా సూత్రములున్నవి. జాతి, మత, కుల బేధములన్నీ మనిషి కల్పించు కున్నవి. దీనిలో ఎవరైన జేరవచ్చును. పాప పుణ్యములు, వావి వరుసలు, మానవ కల్పితాలు బ్రహ్మ విష్ణు మహేశ్వరులను వారు లేరు. ఒకవేళ ఉన్ననూ వారు మనవంటి వారే. అహింస కంటే పరమ ధర్మమింకొకటి లేదు. మంచి కార్యములు చేయు వారికి మంచి ఫలితలములు కలుగుతాయి. చెడ్డ పనులు చెడ్డ ఫలితములు కలిగి తీరుస్తాయి.

ప్రతి వారికి సుఖంగా జీవించే హక్కు వుంది. సుఖము ధనము వల్ల వస్తుంది. 'ధనమూలమిదం జగత్' చెమట పట్టుట, గుమిలి, చీమిడి వంటి మలినములు విసర్జించే శరీరం కామ సుఖం కోరుతుంది. అది శరీర ధర్మం. జంతు పక్షి సంఘాలు ఎలాగైతే శారీరక సుఖం అవసరం లాగ పొందుతున్నాయో మనిషి కూడ స్త్రీలను పొందుట ముఖ్యం కాని వావి వరుస అర్ధం లేనివి. స్వర్గ సుఖములు నరక బాధలు మానవ కల్పితాలు. దేవుడనేవాడు లేడు. ప్రకృతివల్ల కామం హెచ్చి సంతానం కలుగుతుంది కాని దేవుడు జన్మల నివ్వటం అబద్ధం.



ఇట్టి బోధలు విని త్రిపురాసురులు శివపూజ మాని యధేచ్ఛగా ప్రవర్తించటం మొదలు పెట్టారు. దైవపూజలు ఆగిపోయాయి. ఆలయాలు మూత బడ్డాయి. పాషండులు, నీతి బాహ్యులైన ప్రజలు మంచి కర్మలు మానారు.

అట్టి సమయంలో శ్రీమన్నారాయణుడు భూమిని రథంగాను సూర్య చంద్రులను రథ చక్రాలుగాను చేసి వేదములను గుర్రములుగా జేసి రథంగాని రథం తయారు చేశాడు. మేరువును విల్లుకాని విల్లుగా జేసి ఆదిశేషుని ఆ వింటికి నారిగాని నారిగా బిగించాడు. ఈశ్వరుని రధికునిగా జేసి తను నారాయణాస్త్రమై త్రిపురములను ఒక్కసారి ఛేదించునట్లు శంకరునిచే కొట్టించాడు. ఆ దెబ్బకు త్రిపురములు ఒకేసారి భగ్గుమని మండిపోయాయి.

అంత దేవ దుందుభులు మ్రోగాయి. గంధర్వులు గానం చేశారు. దేవకన్యలు నృత్యం చేశారు. అప్పుడు శ్రీహరి బౌద్ధుని జూచి ఓ బుద్ధా! మీ ఐదుగురు లోకోపకారమే చేశారు. మీ మార్గాలు తప్పుడు మార్గాలు కానీ ఇనుమును వంచాలంటే కాల్చక తప్పదు. అందుకే త్రిపురాసురులను యుపేక్షించాను.



నీవు నీ శిష్యులు కలియుగం వచ్చే వరకు జూద, పాన, జార గృహాలలో నివసించి అక్కడికి వచ్చువారికి బుద్ధివైకల్యం కల్పించి భ్రష్టులను పాపులను చేయండి. కలియుగంలో మీ మతం పెక్కు రాజుల ఆదరణ పొంది వర్ధిల్లుతుంది. అప్పుడు నీవు నన్నూ శంకరుని కూడా మించిపోగలవు అన్నాడు.

త్రిపురాసుర సంహార కథ పాప విమోచనం కలిదోష హరణం అని పెద్దలు జెబుతారు.

చం॥ గొనకొని ఆర్ష ధర్మమును గూల్చెడి బౌద్ధము గాలద్రొక్కగా'
వనజభవాది దేవతలు ప్రార్ధన జేయగ, భక్తులైననున్
తను త్రిపురాసులందరిని దండనజేసెను మృత్యువిచ్చి తా
ననుపమలీల శంకరుడు ఆ కథ నేర్చిన జన్మధన్యమౌ

# 7. నలదమయంతుల చరిత్ర

పూర్వం ఒక మహారణ్యంలో అహూకుడనే గొప్ప శివభక్తుడైన భిల్లుడుండేవాడు. వేటాడంలో అతను ఆరితేరినవాడని పేరు పొందాడు. కాని అతను అనవసరమైన జీవహింస చేసేవాడు కాదు. తన ఇంటికి కావలసినంత మాంసము కొరకు వేటాడేవాడు కాని ఇష్టము వచ్చినట్లు చంపేవాడు కాదు. అతని భార్య అహూకి అన్నివిధాలా అతనికి తగిన భార్య. పార్వతీ దేవిని పూజించక భుజించెడిది కాదు. అతిథులను శివుడని భావించే ఆ ఉత్తమ ఇల్లాలు అన్ని విధములా అహూకునికి తగిన భార్య.

ప్రతిదినము సూర్యోదయమునకు ముందే విల్లంబులు చురకత్తి ధరించి అహూకుడు వేటకు వెళ్ళిన పిదప ఇంటి పనులు పూర్తిచేసి ఆమె పార్వతీ దేవిని పూజించి భర్త వేట, వెదురు బియ్యము, పుట్ట తేనె సంపాదించి తెచ్చి ఇంటికి అలిసిపోయి రాగానే ఆమె ఆప్యాయంగా యెదురు వెళ్ళి పదార్థములను గైకొని వంట చేయుతావున యుంచి, భర్తను కాళ్ళు కడుగుటకు దాహమునకు నీరు ఇచ్చి భర్త పాదములు



వత్తి సేద దీరాక, వంటచేసి ఈశ్వరుని పూజించి నైవేద్యం పెట్టి అతి భక్తితో ప్రార్థన చేసెడిది. ఈలోగా అభ్యాగతులు యెవరైనా వస్తే వారు, తన భర్త తినిన పిదప మిగిలిన ఆహారము తిని ఇల్లు శుభ్రపరచి మిగిలిన సేవలు చేసెడిది.

ఈ విధానం చూసి పార్వతీ పరమేశ్వరులు ఆనందించి వారిని పరీక్షించదలచారు. పరమేశ్వరుడు జగన్మాతతో కాత్యాయనీ! ఈ భిల్ల దంపతుల మీద నాకు అనురాగం కలుగుతున్నది. వీరి శివభక్తిని పరీక్షించెదము. నేను వృద్ధ యతిగా వీరి అతిథినౌతాను. నీవు వ్యాఘ్రమై ఆ భిల్లుని సంహరింపుము

అని చెప్పెను. పార్వతీదేవి నాథా! మీరే దిక్కని మిమ్మల్నే పూజించే మీ భక్తుల కిట్టి శిక్ష అన్యాయం కదా అన్నది.

దేవీ! పుటం బెట్టకుండా సుత్తి దెబ్బలు తినకుండా మనోహరమైన ఆభరణం తయారు కాదు కదా. అదే రీతిగా వీరిని పరీక్షిస్తాను. వీరు యెంత కన్నీరు కారిస్తే నాకు అంత దగ్గిరవుతారు, నీపని నీవు చేయి అని మనోహరంగా నవ్వాడు శివుడు.



వృద్ధ యతిని ఆప్యాయంగా ఆహ్వానించి అర్ఘ్య పాద్యాల తరువాత వెదురు బియ్యం, పుట్టతేనె మధుర ఫలాలతో సుష్ఠుగా అతిథి కడుపునిండింది. అహూకుడు తన అతిథుని చూచి అయ్యా! ఈ మహారణ్యంలో ఈ వేళమేమే ఎక్కడకు పోలేము. మీరు దారి తెలుసుకోలేరు. కావున నేటి రాత్రి మా ఇంట విశ్రమించండి. దారి దొంగలు, క్రూర జంతువులు తిరిగే ఈ అడవి, రాత్రి ప్రయాణం చాలా కష్టం అన్నారు.

అందులకు అతిథి మీదేమో ఒకే గది ఉన్న పాక. నేను పరుండిన మీకెట్లు? అన్నాడు. అహూకి అయ్యా! పురుషులిద్దరూ ఇచ్చట శయనింపుడు నేను విల్లంబులు ధరించి బయట కాచియుండి మిమ్ములను కాపాడెదను అన్నది. దానికి అహూకుడు ఇదేమి వింత! పురుషుడు విశ్రమించుట స్త్రీ సంరక్షించుటయా? సిగ్గు సిగ్గు. మన అతిథి దైవ సమానుడు. నీకు పితృ తుల్యుడు. మీరిద్దరూ లోపల శయనించండి, నేను బయట కాపలా ఉంటాను అని విల్లంబులు గైకొని బయట కావల ఉన్నాడు.



పార్వతీదేవి వ్యాఘ్రరూపంలో వచ్చి సడీ సవ్వడి లేకుండా భిల్లుని గుటుక్కుమని మింగివేసింది. ఉదయాన అహూకి లేచి రక్తపు మరకలు, వ్యాఘ్ర కాలి గుర్తులు చూచి జరిగిన సంగతి తెలుసుకుని, రోదించి, తన అతిథిని పల్లెత్తుమాట అనక అయ్యా నాకర్మకి మీరెలా బాధ్యులు? దయచేసి నన్ను నాభర్త విల్లంబులతో పాటు సహగమనం అవనివ్వండి. నాభర్త ఆత్మ నాకొరకు ఎదురు జూచుచుండునని అగ్ని ప్రవేశము చేసినది. వెంటనే పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమై ఓ అహూక దంపతులారా మీరు మా పరీక్షలో నెగ్గి మాకు ఎంతో ఆనందం కలిగించారు. మీరు నిషధ రాజు నలునిగా ఆతని భార్య దమయంతిగా జన్మించి దేవతలు మెచ్చుకునే కీర్తి సంపాదించి కొంతకాలం కలి పీడ అనుభవించి ఆచంద్ర తారార్కమైన కీర్తి సంపాదించండి ఇప్పుడు వ్యాఘ్రమై మిమ్మల్ని విడదీసిన పార్వతి ఆ పాప ప్రాయశ్చిత్తంగా హంసయై మిమ్మల్ని కలుపుతుంది అని అదృశ్యమయ్యారు.

అహూకుడు అతని భార్య ఎంతో సంతోషించి ఆ జన్మలో పరమ నిష్ఠా గరిష్ఠులై పార్వతీ పరమేశ్వరులను

పూజించుచు గడిపి ఆ జన్మాంతరంబున అహూకుడు నిషిధ దేశాధీశుడైన వీరసేనునిగా సూర్యవంశమున జన్మించాడు. ఆహూకి విదర్భ దేశమునకు ప్రభువు భీమ మహారాజునకు, దమయంతి అను పేరుతో జన్మించి గొప్ప సౌందర్యవతి సుగుణాల రాశిగా పేరొంది దేశాల రాజుల, రాజకుమారుల ఊహాసుందరి అయింది.

వీరసేనుడు, నలుడు అనే పేర పెరిగి గొప్ప శూరుడై అందగాడై ప్రసిద్ధి జెందాడు. అతను అశ్వ విజ్ఞానమున, పాకశాస్త్రమున సుప్రసిద్ధ నేర్పుగలవాడయ్యాడు. అతని వేగం అనితర సాధ్యం.

పార్వతీదేవి తనిచ్చిన వాగ్దానం ప్రకారం హంసగా మారి దమయంతి ఉద్యాన వనం చేరి విచిత్రంగా నడిచి ఆమె నాకర్షించి ఆమెకు దొరికి ఓ దమయంతీ! నేను ఎంతోమంది సుందరీ మణులను చూచాను. స్వయంగా రంభనెరుగుదును. ఆమె నీకు ఎందులోనూ సాటి కాదు అంటే నేను ఏమాత్రం అబద్ధం చెప్పటం లేదు సుమా. నన్ను విడిచి పెడితే నీకు తగిన భర్త ఎవరో చెబుతాను



అన్నది. యువతీ సహజమైన కౌతుకంతో ఆమె హంసను వదలి బెట్టింది.

ఓ దమయంతీ! నేను సత్యవాక్య పరురాలను. నామాట నిజము. నీకు తగిన భర్త నిషధాధీశుడైన నలమహారాజు ఒక్కడే. నీవు నన్ను వదిలిపెట్టినందుకు ప్రతిగా నీకు అతనికి వివాహం జరిగేలా నేను ప్రయత్నిస్తాను అని చెప్పింది. నవ్వుతూ అలాగేనని దమయంతి హంసని వదిలిపెట్టింది.

రివ్వున ఎగిరి పోయిన ఆ హంస నలుని యెదుట వాలి ఓ నలమహారాజా! నే జెప్పుమాట వినవయ్యా అన్నలు నేను బ్రహ్మ వాహనమైన రథమునకు గుర్రంలా పనిచేసే దాన్ని. ఒకనాడు పంకజభవునితో వెళ్ళినప్పుడు స్వామీ నలమహారాజుకు తగిన భార్య లేరని నానమ్మకం. ఒకవేళ వుంటే ఎవరో వినాలని కుతూహలంగా వున్నది అని అడిగాను. ఆయన ఏదోపేరు చెప్పాడు. రథపు చక్రాల గొడవలో సరిగా వినిపించలేదు గానీ దమయంతి అని నాకు స్ఫురించింది. ఆమెకు స్వయంవరం ప్రకటించి నీకు కూడా ఆహ్వానం పంపారు. వార్తా హరుడు రేపు వస్తున్నాడు. నీవు



తప్పక వెళ్ళు. అంత సుగుణాల రాసిని, అందాల భరిణను బ్రహ్మ ఎప్పుడో ఒకసారి పుట్టిస్తుంటాడు. నామాటవిని వెళ్ళు అన్నది.

సలహా చెప్పింది పార్వతీదేవి. ఇక మనస్సుదాని పని అది చేసుకు పోతుంది. నలుడు స్వయంవరానికి వెళ్ళాలని అనుకున్నాడు. రాజకుమారులకు ఏర్పరచిన విడిదిలో దిగాడు. ఆ రాత్రి దేవేంద్రుడు, యముడు, వరుణుడు, అగ్నిదేవుడు కలిసి నలుని విడిదికి వెళ్ళి తమలో ఎవరో ఒకరికి దమయంతి దక్కుటకు సహాయము చేయుమని అడిగారు. అతడు నేను ప్రయత్నించను గాని ఆమె నన్ను వరించిన నాదోషముండదు అని వారిని మర్యాదగా పంపించాడు.

దేవతలిచ్చిన శక్తితో నలుడు అదృశ్య రూపంలో దమయంతి మందిరానికి వెళ్ళి ఆమెను అడిగాడు. ఆమె ససేమిరా అన్నది. నీవు నాకు బ్రహ్మ ఇచ్చిన భర్తవు అన్నది.

స్వయంవరం రోజున నలుని సరసనే దేవేంద్రాదులు కూర్చున్నారు. వరమాల ధరించిన దమయంతి అక్కడ



ఐదుగురు నలరాజులను జూచి నివ్వెరబోయింది. కాని సమయస్ఫూర్తి కలిగిన ఇంతి దమయంతి. ఆ ఐదుగురిలో దేవతలైన నలుగురూ అనిమేషులు. వారికి కనురెప్పలు ఆర్పబడవు. ఆమె నలుని గుర్తించి దేవతలతో అయ్యా మీరు నా పితృ సమానులు. దిక్పాలురు. నన్ను కోరుట న్యాయమా? నన్ను నా భర్తను ఆశీర్వదించండి అని వారికి నమస్కరించి వరమాల నలుడి మెడలో వేసింది. దేవతలే హర్షధ్వానాలు చేసి నలదమయంతులను ఆశీర్వదించారు.

వివాహం వైభవోపేతంగా జరిగి నూతన వధూవరులు నిషధ చేరారు. కలిపురుషుడు స్వయంవరానికి పిలుపు లేకున్నా వచ్చి నిరాశ పొంది ఎలాగైనా నలుని బాధించాలని తలచాడు. కాని నలుడు ఒక్క అనాచారము కూడ లేని శివభక్తుడు. ఏమీ చేయలేక సమయం కోసం వేచి వున్నాడు కలిపురుషుడు.

ఒకరోజు లఘుశంక, దీర్ఘుకొనుటకు వెళ్ళి నలుడు పరధ్యానముతో కాళ్ళు కడుగు కొనుట మరిచాడు. వెంటనే కలి నలుని ఆక్రమించుకున్నాడు.

తన దాయాది పుష్కరునితో పాచికలాడి రాజ్యం కూడా పోగొట్టుకున్నాడు నలుడు. కట్టుబట్టలతో భార్యతో రాజ్యభ్రష్టుడైనాడు నలుడు. విధిలేక తన ఇద్దరు బిడ్డలను దూతద్వారా మామగారింటికి పంపివేశాడు. ఒకరోజు పావురాలను పట్టి భుజించు ఆలోచనతో తను ధరించు వస్త్రాన్ని పావురాలమీద వేశాడు. ఆ పావురాలు ఆశ్చర్యకరంగా ఆ వస్త్రంతో సహా ఆకాశంలోకి ఎగిరి పోయాయి. దమయంతి చీరె సగం చించి కట్టుకుని దీనంగా విలపించాడు నలుడు.

విధి దయమాలిన వేరికగును? అని పెద్దలు అన్నారు కదా. నలుడు ఆమెని తండ్రివద్దకు పొమ్మని ఎంత జెప్పినా ఆసాధ్వి జీవమైనా మరణమైనా అతనితోనే అన్నది. ఒకరోజు ఆమెను చూడలేక నలమహారాజు పిరికి వానిలా చీకటిలో భార్యని ఒంటరిగా వదలి నన్ను క్షమించు దమయంతీ అనుకుంటూ చీకటిలో ఎటో పారిపోయాడు.

పురుషునికి ఇంతకంటే దౌర్భాగ్యం ఉంటుందా? నిద్రలేచి దమయంతి భర్తను కానక రోదించి పిచ్చిదానిలా



అడవుల వెంట పోసాగింది. దిక్కులేని వారికి దేవుడే దిక్కంటారు. ఆమాట ఎంత నిజం! ఒక కొండచిలువ దమయంతిని పట్టుకుంది. భీతితో రోదిస్తున్న ఆమెను ఒక బోయవాడు రక్షించాడు. వాడి కామ భరిత ఆక్రమణనుంచి ఆమె క్రోధ పూరిత శాపం వంటి ఛీత్కారమే వాడిని నిలువునా దగ్ధం చేసింది. కొంతమంది బాటసారులైన వ్యాపారుల సహాయంతో అడవి దాటింది దమయంతి. చేది రాజ్యం చేరిన ఆ సాధ్వి నిరాసక్తలా నడుచుకుంటూ పోయి రాజమాత దయపొంది ఆమె సముఖానికి తేబడింది.

ఆమెకు తన కథ సాంతం వివరించక తను సైరంధ్రినని కొన్ని కారణాలవల్ల పతియెడబాటు ప్రాప్తించిందని పతివ్రతనని, కులస్త్రీకి తగిన సమాన మర్యాదలు చూపితే రాజమాతని సేవించుకుంటూ ఉంటానని చెప్పింది. రాజమాత సంతోషించి తన పుత్రిక సునందను బిలిచి తల్లీ! కారు మేఘాలు కమ్మిన పూర్ణ చంద్రుడి వంటి ఈమె ముఖం చూస్తేనే సంతోషం కలుగుతుంది. ఈమెను నీ చెలికత్తెగా ఆహ్వానించి సంతోష పరచుము అని చెప్పింది.



అక్కడ విదర్భలో కుండిన నగరంలో తన కూతురి సంతానాన్ని సాకుతూ కూతురు అల్లుడికోసం చింతిస్తూ భీమ మహారాజు పురోహితులను నలుదిక్కులా పంపించి కూతురు జామాతల జాడ కనుగొనుటకు ప్రయత్నించ సాగాడు. సుదేవుడను బ్రాహ్మణుడు చివరికి చేధి దేశానికి చేరి రాచనగరంలో దమయంతిని చూచి గుర్తించి తల్లీ! నీతండ్రి మనోవ్యాధితో నీపిల్లలతో పాటు నీకోసం నీభర్తకోసం కృశించిపోతున్నాడు. ఆయనను వృద్ధాప్యంలో ఇంకా కష్టపెట్టుట తగదు. రా తల్లీ! అని బ్రతిమాలినాడు. అప్పుడు రాజమాత, ఆసైరంధ్రే దమయంతి అని, తన అక్క కూతురని గ్రహించి, దుఃఖ సంతోషాలతో ఉక్కిరి బిక్కిరి అయి రాచమర్యాదలతో ఆమెను సుదేవుని వెంట విదర్భకు పంపించింది.

ఈ విధంగా కన్నీటి కడలిలో పయనించి చివరికి తీరానికి చేరుకుంది దమయంతి. కాని కష్టాలు తీరలేదు. పతి జాడ నెరుగక చివరికి ఆ బ్రాహ్మణోత్తముడు సుదేవుడే తన అండ అని ఆయనను పిలిచి నలమహరాజుని కనుగొనమని పంపింది.



అయితే నలుని కథ ఏమిటి? భార్య సగం చీరెతో పారిపోయిన నిషధ సామ్రాజ్యాధిపతి, తను చేసిన పనికి సిగ్గుపడుతూ పిచ్చివాడిలా పోసాగాడు. ఇంతలో అడవిలో కార్చిచ్చు ప్రజ్వరిల్లింది. నలమహారాజా! నన్ను కాపాడు అని కేక విని చూచి, మంటల్లో చిక్కుకున్న పెను సర్పమును చూచి జాలిపడి తనప్రాణాలకు తెగించి దానిని కాపాడాడు నలుడు. దివ్య కాంతితో వెలిగిపోతున్న ఒక పురుషుడు కనిపించి ఓ నలమహారాజా! నీదయ వల్ల నాకు శాప విమోచనం కలిగింది కృతజ్ఞుడను అని ఆయనను తాకాడు. వెంటనే దివ్య సౌందర్యవంతుడైన నలుడు కురూపిగా మారిపోయాడు.

నలుడు ఆహా! పాముకు పాలుపోయటం అంటే ఇదే కదా, అన్నాడు. దానికి ఆ నాగరాజు, నలరాజా! విచారించకు నేను పేరుకు కర్కోటకుడనే గాని నీ శ్రేయోభిలాషిని. నీవు ఇంకా కొంతకాలం, ప్రారబ్ధకర్మ అనుభవించాలి. నీకంటే తక్కువ వాడయిన రాజు అండలో నీవు కొంత కాలం గడపాలి. అప్పటికి గాని నీకు కలి బాధ

తీరదు. నీ సుందర రూపంతో నీవు వుండరాదు. కలి ప్రభావం పోగానే నీవు నీకు ఇంత హానిని చేసిన పుష్కరుని జయించి నీరాజ్యం నీ రూపమూ తిరిగి పొందగలవు. నీవు ఎప్పుడు తలుచుకుంటే అప్పుడునేను ప్రత్యక్షమవుతాను.

నీవు అయోధ్యా నగర రాజు ఋతుపర్ణుని వద్ద అశ్వ శిక్షకుడిగా చేరుకో. ఆయనను నీ వంటల ప్రావీణ్యంతో మెప్పించు అన్నాడు. కురూపి అయిన నలుడు, బాహుకుడను పేరుతో అయోధ్యాధిపతి ఋతుపర్ణుని వద్ద చేరాడు.

రాత్రివేళ నిద్రకు దూరమయి దుఃఖించు బాహుకుని జూచి అతని శిష్యులు ఆతని దుఃఖ కారణం అడిగారు. మర్మగర్భంగా నలుని ప్రారబ్ధ తప్త గతాన్ని కథలా వివరించాడు నలుడు. పరుల సానుభూతి బాధ తగ్గించవచ్చు కాని తీర్చదు.

నలుని వెదకుచూ అయోధ్యా నగరం చేరిన సుదేవుడు ఇది విని ఆశ్చర్యపోయాడు. సౌందర్యదేవతయైన నలునికీ ఈ కురూపికీ పొంతునలేదుకానీ ఇతని ప్రవర్తన నలునివలె ఉన్నదని తలంచి దమయంతి చెప్పినట్లు భార్య చీరెకూడా



సగం కాజేసి అనాధగా కీకారణ్యంలో వదలి తనదారి తను చూసుకున్న పురుషాధమునికి మీ రాజ్య న్యాయస్థాన ప్రకారం శిక్ష ఏమిటని ప్రశ్నించాడు. దానికి నలుడు విషాద వదనుడై పైకి మాత్రం ధర్మసూక్ష్మము అంత తేలికగా బోధపడదు. తనప్రారబ్ధం తన భార్యని కూడా బాధిస్తున్నది అని తెలిసికొన్న నలుడు తనులేక పోతే నన్నా ఆమె తన తండ్రి వద్దకు పోయి కడుపునిండా తింటుంది అనే ఆలోచనతో అలా చేసి వుండవచ్చు. త్వరపడి ఒక నిర్ణయానికి రాకూడదు. ఏది న్యాయమో ఏది అన్యాయమో కేవలం ఈశ్వరుడొక్కడే తెలుసుకోగలడు అన్నాడు.

సత్వరమే అక్కడినుండి రాజుగారిని కలిసి ఋతుపర్ణ మహారాజా! మా దమయంతీ దేవి ద్వితీయ స్వయం వరానికి మిమ్మల్ని ఆహ్వానించడానికి వచ్చాను. కాని దారిలో చిక్కుకు పోయాను. క్షమించండి. వీలయితే రేపు ఉదయం మా దమయంతీ దేవి ద్వితీయ స్వయం వరానికి వెళ్ళండి అన్నాడు. రాజు బాహుకుని పిలిచి, ఓయీ గతంలో నీకు నేను ద్యూత విద్య నేర్పాను. నీద్వారా అశ్వహృదయం నేర్చాను. ఈరోజు నీ అవసరం వచ్చింది. నాద్యూత విద్య



నేర్పరి తనం అంతా నీకు ధారపోస్తున్నాను. నన్ను రేపు సూర్యోదయానికి ముందర విదర్భ చేర్చు అన్నాడు.

ఇక నలుడు రధ చోదనంలో తన నేర్పరితనం అంతా చూపించాడు. రాజు తన ఉత్తరీయం పడిపోయింది, ఆపు తీసుకుందాం అని చెప్పేసరికి ఒకయోజన దూరం దాటిపోయారంటే ఎంత వేగమో ఊహించవచ్చు. ఆ తర్వాత ఋతుపర్ణుడు విడిదిలో దిగిన పిదప దమయంతి దూతిక నలునితో నిష్ఠూరంగా మాట్లాడడం, నలుడు దమయంతి సమాగమం తర్వాత కలిపురుషుడు నలుని విముక్తునిచేసి క్షమాపణ కోరటం, నలుడు స్వస్వరూపం ధరించడం, ఋతుపర్ణుడు నలుని క్షమించమనడం, నలుడు ఆదరంగా ఋతుపర్ణుని మేళ్ళను కొనియాడడం, నలుడు పుష్కరునితో తిరిగి జూదంలో ఘోర పరాజయం పాలుచేసి కత్తితో తల నరకబోగా పుష్కరుడు దీనంగా ప్రాణదానం కోరడం, నలుడు ఉదార హృదయుడై క్షమించి తనదాయాదిని వదిలివేయడం, నలుని సామంత రాజులు తిరిగి ఆనందంగా ఆయన సార్వభౌమత్వాన్ని ఆదరించడం, ప్రజలంతా ఆనందించడం ఒకదాని తర్వాత ఒకటి జరిగిపోయాయి.



కష్టాలన్నీ కడతేరిన నలదమయంతులు పిల్లలతో ఆనందంగా ప్రజారంజకంగా పాలన చేశారు. శివపార్వతులవల్ల తమ గతజన్మ అహూక అహూకిల వృత్తాంతం విని, వారిట్లా అన్నారు. పరమశివా! పుటం వేస్తేనే బంగారం వన్నె పెరుగుతుంది. దుర్దశ అనుభవిస్తేనే మీదయ మాపై కలుగుతుంది. నీవు స్వయంగా కైలాస వాసం అనుగ్రహించటం మా సుకృతం కాక మరేమిటి? నీవు మాకిస్తానన్న వరం ఇదే ఈ మా గాధ విన్న వారికి ఆ కలిపురుషుడి బాధనుంచి విముక్తులగు భాగ్యం ప్రసాదించు అన్నారు. శివపార్వతులు సంతోషంగా అంగీకరించారు.

ఉ॥ పుత్తడి వన్నె పెంపగును పూని పుఠంబును
వెట్టినంత, తా
ముత్తములైన మానవులు ఓపిక నుందురు
ధర్మమార్గమున్
కత్తితొనుత్తరించినను కాదనరీ 'నలుడి'ట్టి
వాడెయా
ఉత్తము గాధనేర్వ 'కలిపూరుషు' బాధలు
అంటబోవుగా

# 8. తులసి శంఖ చూడుల చరిత్ర

కశ్యప మహాఋషి కుమారుడు విప్రజిత్తుడు. దితి గర్భసంజాతుడైన ఆతడు గొప్ప ధార్మికుడు. వాని కుమారుడే దంభుడు. దానవులంతా హరి ద్వేషులై శివభక్తులై యుంటే ఇతను మాత్రం శ్రీమహా విష్ణువుని, లక్ష్మీదేవిని తన కన్నతల్లి దండ్రులుగా భావించి పూజించసాగాడు.

ఆ దానవునికి చాలకాలము వరకు సంతానము లేక విచారించి, బదరికా వనమునకు బోయి శ్రీహరి గూర్చి ఘోర తపస్సు చేశాడు. అంత తేలికగా కరుణించని ఆ లక్ష్మీ కాంతుడు గూడా దంభునికి ప్రత్యక్షమై నీకు కావలసినది కోరుకోమన్నాడు.

దంభుడు ఓ జనార్దనా! నాకు అమిత బల పరాక్రమ శాలి, త్రిలోక విజేత, నీయందు భక్తి కలిగిన పుత్రుని ప్రసాదించుము, అని కోరాడు. స్వార్థము కొరకు వరము కోరినా, నీ భక్తుడు కావాలని కోరినందున విష్ణువు కూడా దంభుని కోరిక మన్నించాడు. గృహమున కేతెంచిన దంభుడు యధావిధిగా రాజ్యపాలన చేస్తూ శ్రీహరి వరము ఎప్పుడు జరుగుతుందా అని వేచి యున్నాడు.



కొంతకాలమునకు దంభుని భార్య గర్భవతై నెలలు నిండాక తేజస్సుతో వెలిగిపోతున్న కుమారుని ప్రసవించింది. అమితానంద పరవశుడైన దంభునికి అశరీరవాణి ఇలా అన్నది. ఓ దంభా! వీనికి శంఖచూడుడు అని పేరు బెట్టుము. వీడు ముల్లోకాలను జయించగలడు.

దంభుడు గొప్ప సంతోషముతో ఆ బాలుని పెంచి ఎనిమిదేండ్లు రాగానే ఉపనయనం జేసి శుక్రాచార్యుల వద్ద విద్యాభ్యాసానికి చేర్పించాడు. విద్యాభ్యాసం పూర్తిజేసికొని తన తల్లిదండ్రి అనుమతి పొంది శంఖచూడుడు వింధ్య పర్వత సానువులలో బ్రహ్మను గూర్చి ఘోరమైన తపస్సు చేయసాగాడు.

ఆ తపస్సు బ్రహ్మను మిక్కిలి సంతోష పరచింది. వెంటనే పరమేష్ఠి శంఖచూడుని ముందు ప్రత్యక్షమై నీకు కావలసిన వరం కోరుకోమన్నాడు. అతడు ఓ పరమేష్ఠి! నాకు దేవ, దానవ, నర, నాగ జాతులలో ఎవ్వరి వల్లను మృత్యువు రాకూడదు. నేను ముల్లోక విజేతనై మంచి పాలకుడని పేరు పొందవలెను. సకల భోగములు నాకు



ప్రాప్తించవలెను. ఈ వరములిచ్చిన నేను సంతసించెదను అన్నాడు.

బ్రహ్మ ఓ శంఖచూడా నీ కోరిక తప్పక నెరవేరును. నీవు బదరికా వనమునకు బోయి అక్కడ తులసి అను యువతిని కలిసి నామాటగా వివాహమాడి సుఖింపుము అని జెప్పెను.

శంఖచూడుడు బ్రహ్మ ఆనతిని పాటించి, ఆమెను జూచి ఆమె సౌందర్యమునకు ఆశ్చర్యపడి ఓ సుందరీ నీవెవ్వరవు? ఈ బదరికా వనంలో ఎందుకు ఉంటున్నావు అని అడిగాడు. ఆమె అతని రూప గుణములకు ఆకర్షితురాలై సిగ్గుతోనే నాపేరు తులసి. నేను ధర్మధ్వజుడను రాజుగారి పుత్రికను. నేను జగద్విజేతను పెండ్లాడి మహాపతివ్రత అని పేరు పొందాలని తపము నాచరించుచున్నాను. తమరెవరో యెరింగింప వలసినది అన్నది.

దానికాతడు తన వివరాలు చెప్పి ఆమెను వివాహమాడ వలెనని యున్నదని తన కోరికను తెలిపాడు. ఆమెను గాంధర్వ వివాహమాడవలయునని తనకోరికను



తెలిపాడు. ఆమె అది ఈశ్వరేచ్ఛగా భావించి వివాహమునకు అంగీకరించింది.

ఈ విధముగా మహా పతివ్రతయైన తులసిని వివాహమాడి శంఖచూడుడు మించిన బలశౌర్యములతో తన తండ్రియెదుట నిలిచి తండ్రీ! నీ కోరికే గాక బ్రహ్మ మాటను నెరవేర్చ గలిగాను. ఇక నా శౌర్య ప్రతాపములతో ముల్లోకములను గడగడలాడించి నామాటకు తిరుగు లేకుండా చేసెదనని, శుక్రాచార్యులు నిర్ణయించిన సుముహూర్తమునకు స్వర్గముపై దండెత్తి ఇంద్రుని సింహాసనమునుండి తొలగించి తన ఏలుబడి ప్రవేశపెట్టెలని నిర్ణయించాడు.

ప్రత్యక్ష వైరములేక యున్ననూ దానవనాధులు దేవతలను బాధించుట పరిపాటి అయింది. ఒక్కసారి ఆ ఇంద్రుని సింహాసనంపై కూర్చొనగానే అదేమి రోగమో కాని సద్బుద్ధి గల దానవ చక్రవర్తులైనా గర్విష్ఠులై పతనం చెందారు. గొప్ప విష్ణుభక్తుడైన శంఖచూడుని గతికూడా అదే అయింది.

అగ్నికి ఆజ్యము తోడువడినట్లు శుక్రాచార్యుడి ప్రోద్బలం ఎక్కువవడంతో శంఖచూడుడు సూర్యోదయ సమయాన స్వర్గాన్ని ముట్టడించాడు. వరప్రభావంగల శంఖ చూడుని దేవేంద్రుడేమీ చేయలేకపోయాడు. కాలం మనది కాదనుకొని ఇంద్రుడు రాజీకి వచ్చి ఓ శంఖచూడా నలుబది అహోరాత్రములలో దేవతలనందరిని సమూలంగా ఓడించగలిగిన నీకంటే వీరుడెవడు. దేవతలందరూ కలిసి నిన్ను ఓడించలేక పోతున్నారంటే అది నీవర ప్రభావమే కదా. అనవసరంగా ఇరు సేనలలోని వీరులు గాయాలతో బాధపడుట, మరణించుట దేనికి. నేను ఓటమి నంగీకరిస్తున్నాను.

నీకు సమంజసం అనిపిస్తే నేను నీ ఆజ్ఞాబద్ధుడనై నీ సామంతుడిగా పరిపాలిస్తాను అన్నాడు. శంఖచూడుడు విష్ణు భక్తుడగుట చేత అంగీకరించి తను త్రిలోకాధిపతిగా అంగీకరించబడి శోణితపురం చేరాడు. 'వజ్రం వజ్రేన బధ్యతే' అనగా వజ్రమే వజ్రాన్ని తుంపగలదు. వీనిని చంపగలవాడు ఆ శివకేశవులలో ఎవరో గాని అన్యులు చేయలేరని ఇంద్రుడు



యోచించి తగు సమయమునకు వేచి యుండెను.

'వినాశకాలే విపరీతబుద్ధి' అన్నట్లు ప్రతిదినము దేవతల పూజలు పొందుతున్న శంఖచూడుడు మదించి ఋషులను, వేద పండితులను బ్రాహ్మణులను తనకు హావిర్భాగ మిమ్మని తనను వేదోక్తంగా పూజించమని శాసించాడు. అతని శాసనం అమలు జేయవలసిన దానవులు మహాక్రూరులై ఋషులను కొట్టి బాధించడం మొదలు పెట్టారు.

అనాధ రక్షతే విష్ణుః గావున వారంతా హే జనార్దనా! రక్షింపుము అని వేడుకున్నారు. విష్ణువు వారితో ఓ ఋషులార వీడు నా అంశచే జన్మించి దుర్మార్గుడైన వాడు పైగా వీని భార్య పాతివ్రత్యం దీనిని కాపాడుతున్నది. అందుచే మీరు శంకరునికి మీ బాధ తెలుపండి అన్నాడు.

మహామునులు కైలాసం జేరి శివుని వేడుకున్నారు. ఓ మహాదేవా! ఈ పీడ మాకెంత కాలం? యజ్ఞ కర్మలు సాగుట లేదు. జగద్రక్షకుడని విష్ణుని ప్రార్థించినా తనవల్ల కాదని నిన్ను శరణు వేడమన్నాడు. మాకు నీవే దిక్కు. ఆ



శంఖచూడుని సంగతి నీవే చూడవలెనని వేడుకున్నారు.

పార్వతీరమణుడు వారిని ఓదార్చి, తప్పక వారి బాధలను రూపుమాపెదనని వారిని పంపించి వైచి, జనార్దనుని కమలసంభవుని పిలిపించి ఆలోచన జేసెను. దాని ప్రకారము నారదుడు శంఖచూడుని జేరి కుశల మడిగి వానిని పొగిడి ఈశ్వరుడే మునుల మాటలకు లొంగి నీపై యుద్ధం చేయాలని, సన్నాహాలు చేస్తున్నాడు. వివేకవంతులు ఆపద వచ్చే దాక ఆగి ఆ తరువాత చూతములె అని ఆలోచించరు. వారే ఎదురు దాడికి బోయి, శత్రు నిర్మూలన చేసెదరు. శత్రువుని హఠాత్తుగా దెబ్బ తీసెదరని. యుద్ధ నీతిని జెప్పి శంఖచూడుడే కైలాసముపై దండెత్తునట్లు చేశాడు.

తక్షణమే కైలాస పర్వత సానువులయందు పార్వతితో విహరించుచున్న పరమేశ్వరుడు నందీశ్వరుని బిలిచి జరుగుచున్న సంగతి చర్చించి వీరభద్రుని భద్రకాళిని వారి వారి సేనలతోనూ కుమారస్వామిని తన దేవతల సేనతోను కైలాసమునకు వేగిరమే రమ్మని పిలుపు బంపెను.



సూర్యోదయమునకు ఇరు సేనలు యుద్ధానికి సిద్ధమై నిలిచాయి. అతి భయంకరమైన పోరు జరిగింది. ఎంతకాలం గడచినా అలసటే గాని రెండు సేనలకు ఎక్కువ నష్టం జరుగలేదు. విసుగు కలిగి ఈశ్వరుడు జనార్దనునికి బిలువనంపి ఓ లక్ష్మీపతీ! ఇదేమి వింత ఈ రాక్షసుడు యెంతకూ మరణించడు వీని తండ్రివైన నీవే ఏదో ఉపాయము చెప్పుము అని అడిగాడు.

దానికి విష్ణువు ఓశంకరా! వీడు నా వరప్రసాదము వలన దంభునికి కలిగిన గోలోక వాసి. వీని భార్య తులసి, లక్ష్మి అంశమున జన్మించిన మహాపతివ్రత. ఆమె సౌశీల్యము వీనిని కాపాడుచున్నది. ఎన్ని సంవత్సరములైనను వీని జంపుట అసాధ్యము. లోక క్షేమమునకై నేను చేయరాని పాపము జేసి తులసి పాతివ్రత్యమును చెడగొట్టి వీనిని నశింప జేసెదను. నీవు దేవీ గణములతో వీనిపై పోరును సాగింపుము అని జెప్పెను. ఆ జనార్దనుడు మాయా శంఖచూడుడై యుద్ధమునుండి తిరిగి వచ్చిన వాని వలె తులసిని జేరెను.

ఆమె మిక్కిలి సంతోషించి షోడశోపచారములతో పూజించి యుద్ధ విశేషములను అడిగెను. దానికాతడు ప్రేయసీ! అప్రియములైన యుద్ధ వార్తలెందులకు, నా తనువు విశ్రాంతిని కోరుచున్నది. మనస్సు నీ పొందుకోరుచున్నది. చిరకాలమైనది సుఖింతము అని ఆమెను పొందెను.

ఇక్కడ యుద్ధ భూమిలో ఒక్కొరొక్కరుగ దానవ శ్రేష్ఠులు మరణించ సాగిరి. అశ్వ సేన నశించి పోయెను. గజసేన పదసేననే చంపి తాము కూడా తమలో తాము పోరుచు నశింప సాగినవి.

శంఖచూడుడు ఈ హఠాత్పరిణామమును జూచి నిరుత్తరుడయ్యెను. అయినా ధైర్యం కోల్పోవక, రక్త ప్రవాహములలో నున్న జంతువులను, దానవులను జూచి నిరుత్సాహ పడక శంకరునిపై గరుడాస్త్రముతోను, వారుణాస్త్రముతోను, మాయాస్త్రముతోను, ఫాలాక్షుని త్రినేత్ర జ్వాలలను సైతము నారాయణాస్త్రముతోను యెదిరించెను.

ఇక్కడ తులసి తన పాతివ్రత్యము కోల్పోయిన తక్షణమే అశరీరవాణి ఓ పరమేశ్వరా! వీని పుణ్యము నశించినది. నీ



త్రిశూలముతో వీని తల తెగవేయుము. ఆలసింపకుము అని పలికినది. అది విని పినాకి త్రిశూలము అతివేగముగా విసిరి వాని తల ఖండించి వేశాడు.

దేవతలు పుష్ప వర్షం కురిపించగా గంధర్వులు దివ్యగానాలు చేశారు. అప్సరసలు నృత్యం చేశారు. త్రిలోక వాసులూ సంతోషించారు. రుద్రగణాలు మిగిలిన దానవులను అతి తేలికగా సంహరించారు.

అయితే ఇక్కడ శాంబరి అను మాయ ప్రయోగముచే శంఖచూడునిగా తులసికి మోసగించి ఆమెతో సుఖించుచున్న శ్రీహరి ఒకనాడు సురతియంతమున మరచి నిద్రించెను. అది పగటి వేళగుటచే తులసికి తన ననుభవించినది శ్రీహరి అని యెరిగి కోపముతో ఓ విష్ణు! లోకరక్షకుడవు మా ఇలవేల్పువయిన నీవే నన్ను చెరిచినందుకు గండ శిలవైపొమ్ము అని శపించెను.

అప్పుడు శ్రీహరి ఓ తులసీ! నీవు గోలోకమున మహాలక్ష్మీ అంశముతో నా భార్యవై యున్నావు. దంభునికి నేనిచ్చిన వరంచేత నా అంశ శంఖచూడునిగా జన్మించి



మహాలక్ష్మి అంశతో తులసిగా పుట్టిన నిన్ను వరించాను. అయితే నా అంశయే లోక కంటకుడైనప్పుడు వానిని వధించక తప్పదు. నీవు శీలము గోల్పోయినగాని వాడు మరణించడు. నీవు మహా పతివ్రతవు. లోకకళ్యాణమునకై నేనట్లు చేయవలసి వచ్చినది. విచారించకు. నీవు సదా పవిత్రురాలవే. నీ సగం అంశ గండకీ నదియై ప్రవహిస్తుంటే నేను సాలగ్రామ శిలల వలె నీలో వుంటాను. నీ మిగతా సగం పవిత్రమైన తులసి మొక్కగా ప్రతి ఇంట్లో పూజలందుకుంటుంది. శంఖచూడుడు గోలోకం చేరి సుఖాలనుభవిస్తూ నీ రాకకై ఎదురు చూస్తుంటాడు. వాని అస్థికలు శంఖువుల రూపంలో నీ గండకీ నదిలో పవిత్రములుగా ఏరుకోబడి జనులకు ప్రీతి పాత్రము లవుతాయి. గండకీనదిలో స్నానమాచరించిన బుద్ధి పూర్వకముగా జేసిన పాపములు కూడ తొలగిపోతాయి.

ఇక సాలగ్రామము రూపములోనున్న నన్ను శంఖువులచే నీనదీ జలములతో అభిషేకించి తులసీ దళములతో పూజించిన నేను అష్టైశ్వరములను



ప్రసాదింతునని శ్రీహరి వైకుంఠమునకు బోయెను.

చం॥ తన ప్రియ భక్తురాలి దరి దానవవైరి
ముకుందుడొచ్చెగా
మనమున భీతి చెందుచునె మానిని
శీలముదోచె కాపటై
గొనె, తను శాపమున్ తులసి క్రోధము
దీరగ వెట్టినంత, ఆ
ఘనుడగు శంఖచూడు కథ గాధల శైవుల
శ్రేష్ఠమౌగదా .

## 9. పిప్పలాద మహాముని

పూర్వం దధీచి మహాముని గొప్ప తపోధనుడే గాక గొప్ప త్యాగశీలి అని పేరొందాడు. ఆయన భార్యపేరు సువర్ణ. ఆమె సాటిలేని సుగుణాల రాశి మాత్రమే కాదు గొప్ప సౌందర్యవతి అంతకుమించి అందరిచే పొగడబడే సౌశీల్యయైన పతివ్రత. క్షణమైన భర్త యెడబాటు సహించలేని పతి ప్రియ. భర్తకు సపర్యలు జేయుట తప్ప ఆమెకింకో ధ్యాస యుండేది కాదు.

ఒకప్పుడు దేవేంద్రుడు వృత్రాసురునిచే ఓడింపబడి పారిపోయి వేదన అనుభవిస్తున్నాడు. ఆ రాక్షసుడు ఏ ఆయుధముచే చావు రాని వరం పొంది లోక కంటకుడయ్యాడు. బ్రహ్మవద్దకు పోయి మొర బెట్టుకున్న ఇంద్రుని ఓదార్చి ఓ దేవేంద్రా! నాకు దానవులు ప్రియులు కాదు కాని వారి ఘోర తపస్సు నాపుటకు నాకు వారు కోరిన వరము లీయక తప్పుట లేదు. ఒక ఉపాయం చెప్పగలను, వినుము. దధీచి మహర్షి ఇదివరలో గొప్ప



తపస్సు చేసి ఈశ్వరుని మెప్పించి తన ఎముకలు వజ్రముల వలె పటిష్టములయ్యెడి వరం కోరెను. అతని యెముకలు వజ్రములవలె ధృఢమైనవి, కఠినమైనవి. మీరు ఆ త్యాగశీలిని ప్రార్థించి వాని యెముకలను సంపాదించి ఆయుధములుగ మార్చు చేయించుకొని వృత్రాసురునితో పోరిన వానిని జయించవచ్చునని జెప్పెను.

వారు బ్రహ్మకు కృతజ్ఞతలు దెలిపి దధీచి కడకు బోయి సంగతి విన్నవించి మహాత్మా! ఇది అడుగ రాని కోరికే అయినా లోక కళ్యాణార్థం కోరక తప్పుట లేదు. వృత్రాసురుడు అను దనుజుడు బలమైన నీ యెముకలచే చేయబడిన వజ్రాయుధము చేత మాత్రమే నశించును. అన్యధా శరణం నాస్తిత్వమేవ శరణం మమ అన్నారు. దధీచి వంటి త్యాగశీలి లేరు అనునట్లు దధీచి అట్లాగే తీసుకోండి ముందు నా కర్తవ్యాన్ని నెరవేర్చనీయండి. నా భార్య దీనికి ఏమాత్రం సమ్మతించదు. ఆమె దుఃఖాన్ని ఆపుట చాలా కష్టం అని తన భార్యను తన శిష్యులతో వేరొక



ఆశ్రమమునకు బంపి వైచెను.

పిమ్మట దేవేంద్రుని బిలిచి మీకు కావలసిన ఎముకలు తీసుకొనుటకు నేను అనుమతించుచున్నా నని ప్రాయోపవేశము చేయబోయెను అప్పుడు దేవేంద్రుడు మహాత్మా ధధీచి నీ త్యాగము అనన్య సామాన్యము. మమ్మల్ని ఆహారం నిద్రలకు భార్యలకు దూరంచేసిన ఆ దానవ పరిగ్రహమునకు వేరుదారిలేక నిన్ను కోరరాని కోరిక కోరితిమి మమ్ము ప్రాప్తించగలదు అని వినమ్రుడై బలికెను.

అంత దధీచి ప్రాణాయామమును పట్టి కపాల మోక్షము ద్వారా ప్రాణములను వీడెను. ఒక దివ్య తేజస్సు వెలువడి ఆకాశ మార్గమున సూర్యమండలంజేరి అందు ఐక్యం అయింది. మహాశ్చర్యంతో దేవతలు పుష్పవర్షం కురిపించారు.

అప్పుడు దేవేంద్రుడు పవిత్రమైన కామదేనువును బిలిపించి దాని పాలచే దధీచి దేహాన్ని అభిషేకం చేయించి ఆ శరీరంలోని రక్తమాంసములను నాకించి దధీచి



అస్థిపంజరం మాత్రం మిగులునట్లు చేయించాడు. వజ్ర సమానమైన ఎముకల గూడు మిగిలింది.

అప్పుడు విశ్వకర్మను రప్పించి బలమైన వెన్నెముక నుండి వజ్రాయుధం చేయించి తన ఆయుధంగా స్వీకరించాడు. యమధర్మరాజు మాత్రం అస్థిపంజరం వెలువడక పూర్వమే ప్రేగులను పాశమువలె పేన్పించి యమపాశం చేయించుకొన్నాడు. ఈశ్వరుని వరప్రభావంచే అది తిరుగులేని కాలపాశం అయింది. ప్రాణుల జీవుడు దానికి చిక్కక తప్పదు. అదే విధంగా తక్కిన దేవతలందరూ తమకు అనుకూలమైన ఆయుధాలు చేయించుకున్నారు.

ఆ వజ్రాయుధంతో దేవేంద్రుడు వృత్రాసురునిపై దండెత్తి వానిని సంహరించి స్వర్గ పట్టణాన్ని తిరిగి పొందాడు. కొంతకాలానికి సువర్ణ శిష్యులను నాపతి యెక్కడికి వెళ్ళాడు ఇంకా రాడేం అని అడిగింది. సంగతి తెలుసుకొని ఆమె అమితంగా దుఃఖించి నా భర్త పార్థివ దేహాన్ని సంస్కారం లేకుండా ఎముకలు వాడుకుంటారా పశువు (కామధేనువు ఆవు గనుక) తో గడ్డిలా తినిపిస్తారా నీచులారా, మీరు గడ్డి

తినే పశువులై పొంది నేను సహగమనంజేసి నా భర్తను జేరుకుంటాను అన్నది. అప్పుడు అశరీర వాణి ఓ సువర్ణా! ఇందు వారి తప్పులేదు. వారు విధిలేక నీభర్త అనుమతితోనే ఇట్లు చేసినారు. దుర్మార్గులైన దానవులు రకరకాల వరాలు కోరుకుని ధర్మపతనం చేస్తుంటే విష్ణువుకే అహితాలు చేయక తప్పటంలేదు. వీరిని క్షమింపుము. నీవు ప్రాణ త్యాగం జేయరాదు. నీగర్భాన శివాంశ పెరుగుతున్నది. ఓరిమి వహించు అని పరిస్థితి చక్కబరచింది.

సువర్ణ దేవతలను క్షమించింది కాని భర్త వియోగాన్ని తాళలేక రాతితో పగులకొట్టుకొని గర్భ విచ్ఛిత్తి చేసుకున్నది. ఒక రావిచెట్టు మొదట భాగమున ఆకులపై ఆ పిండాన్ని పరిచి ఈశ్వరుని ప్రార్థించింది. చూస్తుండగానే ఆ పిండం నుంచి సూర్య తేజోశాలియైన బాలుడుదయించాడు. అతనిని జూచి సువర్ణ నాయనా నీవు రావిచెట్టు నీడలో బలవంతంగా రాతితో గర్భచ్ఛేదనవలన ఉద్భవించి నాడవు గనుక పిప్పలాదుడని పిలువబడి, రుద్రావతారమై తలచిన వారికి సుఖములను కీర్తిని యిచ్చి చిరంజీవివై వర్ధిల్లుము అని జెప్పి



పంచభూతములను సూర్యుని ప్రార్థించి రగిలిన అగ్నిలో సహగమనము జేసి భర్తయైన దధీచిని జేరెను. ఆ పిప్పలాదుడు మహా జ్ఞానియై దధీచిపేరు నిలబెట్టాడు. గొప్ప తపశ్శాలియైన పిప్పలాదుడు కొంతకాలానికి ముదుసలియైనాడు.

ఇంద్ర సావర్ణిమన్వంతరమున బుట్టిన అనరణ్యుడను చక్రవర్తి ఆ పిప్పలాదునికి మామగారయిన కథ యెంతో ప్రసిద్ధి చెందింది. ఆ అనరణ్యుడు భృగు వంశ సంజాతుడు, తన పురోహితుడగు రుచి ప్రేరేపణచే నూరు అశ్వమేధ యాగములను చేసి చక్రవర్తులలో సర్వశ్రేష్ఠుడని పేరు పొందాడు. ఆయనకు సౌందర్యము, సౌశీల్యము గల అయిదుగురు భార్యలున్నారు. వారివలన ఆయనకు తేజో వీరవరులైన నూరుగురు కుమారులు భువికి దిగివచ్చిన లక్ష్మీదేవి వంటి యొక కుమార్తె కలిగారు. ఆ బాలికకు పద్మావతి అని పేరిడి గారాబముగా పెంచాడు రాజు.

దినదిన ప్రవర్ధమానయై యుక్తవయస్కురాలయిన తన కుమార్తెకు వివాహం చేయాలని దేశ దేశాల రాకుమారుల



చిత్ర పటాలు తెప్పించాడు అనరణ్యుడు కానీ ఒక్కడు కూడా అతనికి నచ్చలేదు.

ఒకనాడు పద్మావతి తన చెలికత్తెలతో ఉల్లాసంగా వన విహారం చేస్తుంటే పిప్పలాదుడు తారసపడి ఆమె సౌందర్య లావణ్యాలకు అబ్బురపడి తన బ్రహ్మచర్యాన్ని వదలి ఆమెను పరిణయమాడాలని తలంచాడు. నేరుగా అనరణ్యుని వద్దకు వెళ్ళి భయ భక్తులతో ఆ రాజు యిచ్చిన అర్ఘ్య పాద్యాలు స్వీకరించి నేరుగా రాజా! నీకుమార్తె పద్మావతిని నాకిచ్చి పరిణయం చేయి. రాజులు దాతలు. బ్రాహ్మణులు దాన గ్రహీతలు నీవు నీకన్యను యెవరికో ఒకరికి దానమీయక తప్పదు గదా. అందుచే నాకే యిచ్చి అపరిమిత సుఖమును వరముగా గైకొనుము. నేను భృగు వంశమున బుట్టిన పరశు రాముని సంతతిలోని వాడను. శాపానుగ్రహ సమర్థుడను. బ్రాహ్మణుడను కాని ఇంత వరకు యెవరిని యేదీ యాచించలేదు. తపఃఫలము యెక్కువై పోయిందని పార్వతీ పరమేశ్వరులకు దానంజేసిన భక్తుడను. నాకంటే నీకు శ్రేష్ఠుడైన అల్లుడెవరు దొరుకుతాడు? కనుక నామాట మన్నించు అన్నాడు. రాజునకు తన అందాల బాలికను ఈ



ముదుసలికి ఎలా ఇచ్చుట అని ఒకవైపు తిరస్కారమున శపించునని ఇంకొకవైపు మథనపడుచుండెను.

ఇంతలో రాజపురోహితుడు రుచి కలుగజేసికొని ఓరాజా! ఈ పిప్పలాదుడు నీ జామాత అయినచో నిన్ను, నీ వంశమునంతను రక్షించును. పద్మినీజాతి స్త్రీలకు అంద చందాలతోనూ వయస్సుతోనూ సంబంధం లేదు. వారికి మనస్సె ప్రధానము తనను ఇంతగా కోరుకునే ఈ పిప్పలాదునే నీ కూతురు ఇష్టపడును గాని అన్యుని గాదు అని రాజును ఒప్పించి కళ్యాణము జరిపించెను. ఈ విధముగా పిప్పలాదుడు జామాతయై శతాశ్వమేధకర్త అనరణ్యుని కీర్తి ఇనుమడింప జేశాడు.

కూతురుపై మమకారం వీడలేని అనరణ్యుడు పిప్పలాదునితో తనకుమార్తెను ముని పల్లెకు పంపి దిగులుతో మంచం పట్టాడు. చివరకు రాజ్యం కుమారులకు అప్పగించి వానప్రస్థాశ్రమం స్వీకరించి, అల్లుని అనుమతితో తనభార్యలతో సహా కూతురి సమీపముననే ఒక పర్ణశాల నిర్మించుకొని భార్యల పరిచర్యలు పొందుతూ సుఖంగా

ఉన్నాడు.

కొంత కాలం తరువాత పద్మావతి నదికి స్నానానికి వెళ్ళింది. ధర్మదేవత యైన ధర్ముడు సుందరాకారుడిగా దివ్యాభరణ వస్త్ర పరిమళములతో ఆమెను సమీపించి ఓ సుందరీ! నీవు నావంటి వాని రాణిగా ఉండదగిన దానవు. నీ యవ్వనమంతా ఆ ముసలి వాడికి వెచ్చిస్తున్నావు. ఇంత అందగత్తెవైనా ఎంత మూర్ఖురాలివి! నిన్న తిరిగి రాదుకదా. అయిన దేదో అయినది. ఇకనైనా నన్ను జేబట్టి నీవు సుఖించి నన్ను సుఖబెట్టు అన్నాడు.

దానికామె దుఃఖము, రోషము గల స్వరంతో ఓరి! దుర్మార్గుడా! నేను మహాముని పిప్పలాదుని భార్యను. నేను త్రికరణ శుద్ధిగా నాభర్త నా సర్వస్వం అని నమ్ముతాను. అన్యులను ఊహనైనా దలంచను నన్నిట్లు నీచముగా మాట్లాడినందుకు నీవు శిక్షార్హుడవు. నీవు క్షయమును పొందెదవు గాక! అని శపించెను.

దానికి ధర్ముడు తల్లీ! నేను ధర్మ దేవతను. నీ పాతివ్రత్యము పరీక్షించమని దేవతల కోర్కెపై అట్లా పలికిన



మంద భాగ్యుడను. వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్లు నిన్ను పరీక్షించుటకు నేను ఎన్నుకున్న మార్గం యెంత మూర్ఖమో ఇప్పుడు తెలిసింది. ధర్మం క్షయమైతే లోకక్షయం కాదా! అన్నాడు.

అందుకు పద్మావతి అయ్యో ఎంత పొరబాటు జరిగింది. మన కోపతాపాలకు లోకాలను బాధించడం యెంత అవివేకం! ఓ ధర్మా! నీవు క్షయ మొందక తప్పదు కానీ ఆ శిక్షను నీవు వృషభాకారమున అనుభవించుము. చంద్రుడు క్షయమువృద్ధి పొందునట్లుగా నీవును కృతయుగమున నాలుగు పాదముల పైనను, త్రేతాయుగమున మూడు పాదములపైనను, ద్వాపర యుగమున రెండు పాదములపైనను, కలియుగమున ఒంటి పాదముపైనను చరించుము. మరల తిరిగి వచ్చు కృతయుగమున నాలుగు పాదములపై తిరిగి సంచరించగలవు. ఈ విధముగా నీకు క్షయమయ్యే శాపం పూర్తి క్షయం కాకుండా కాపాడుతుంది అన్నది.

దానికి ధర్మ దేవత సంతోషించి ఆమెకు ఊహించని



భాగ్యముల నందించాడు. పిప్పలాదుని సౌందర్యం గల యౌవనవంతుడిని చేశాడు. ఐదుగురు కుమారులు ఇద్దరు కుమార్తెలు కలుగునట్లు వరం ఇచ్చాడు. కీర్తి, ఆనందం, సంపద, బంధువులభివృద్ధి లాంటి వరములిచ్చి అదృశ్యమయ్యాడు.

చం॥ ఘనుడగు పిప్పలాద ముని గాంతగు పద్మను
గాంచి ధర్ముడే
మనసున మోహభావమున 'మానిని! వృద్ధుని
వీడి రమ్మనన్
తను క్షయమొంద శాపమిడి ధర్ముని బ్రోచెను
ఎద్దువై యుగం
బునకొక కాలుబోవు నని, వున్నది నేడది
ఒంటి కాలిపై.



## 10. ఉపమన్యుడు

పూర్వకాలంలో వ్యాఘ్రపాదుడను గొప్ప శివభక్తుడు తన భార్య విమలాదేవితో చిన్న మునిపల్లెలో జీవించేవాడు. అతని భార్య గొప్ప సౌశీల్యవతియైన పతివ్రత. ఆమె పుట్టినింటివారు కలిగిన వారైనను, భర్తను వారు చిన్నచూపు జూడరాదని తలచి పుట్టింటి పేరు తలచుటయే మానివేసింది.

ఒకరికి చేయి జాచుటకు ఒల్లని ఆ వేద పండితుడు ఏ రాజాశ్రయము కోరక ఉంఛ వృత్తిని (నేలపై రాలిన ధాన్యమును, ఫలములను మాత్రమే తనకుటుంబమునకు క్షుద్బాధ తీర్చునంతటి తిండిని మాత్రమే గ్రహించుట) అవలంబించి జీవించుచుండెను. అటువంటి వారు అనుకోని అతిధి వచ్చిన తమవంతు భోజనము త్యజించవలెను.

ఆకలిని శివపంచాక్షరి జపించి ఉపశమింప చేసి కొనెడి ఆ వ్యాఘ్రపాదునకు ఈశ్వరానుగ్రహమున ఒక పుత్రుడు జన్మించెను. వానికి జాతకర్మలు చేయించి ఉపమన్యుడు

అని నామకరణం చేసి ప్రేమగా పెంచసాగిన ఆ దంపతులకు ఆ బాలుడే లోకం. దరిద్రము అనుభవించు చుండిననూ బాలుని గారాబముగా పెంచుచుండిరి.

ఆ విమలాదేవి అన్నగారు ఒకరోజున వారి ఇంటికి వచ్చి బావగారిని వేడుకుని సోదరిని బ్రతిమాలి వారిని తమ తల్లిదండ్రులు జూచుటకు వేగిర పడుచున్నారని, వారిరువురను తమ గృహమునకు గొని పోయెను. బాలురకు మాతామహుల ఇండ్లు స్వర్గముల వలె దోచును. గారాబము, అడిగినది తిని, ఆడింది ఆట పాడింది పాటగా జరుగుతుంది. కొన్ని నెలలకు విమల బలవంతం మీద ఆమెను తిరిగి భర్త కొప్పగించి మేనమామ బాలుని ముద్దాడి వెళ్ళలేక వెళ్ళలేక వెళ్ళెను. అమ్మమ్మగారింట పాలు తాగుటకు అలవడిన ఉపమన్యుడు ఒకరోజు పాలుగావలెనని మారాము చేశాడు. తల్లి చోడిపిండి నీళ్ళను పాలుగా యిచ్చిన పారవేసి మంచిపాలు గావాలని గోలచేశాడు.

తల్లి కుమారా! మనము దరిద్రులము. మీ మేనమామలు ధనవంతులు. ధనములేని వారికి పాలు



యెట్లు దొరుకును? నీవు గోల చేసి ప్రయోజనమేమి? కావలెనన్నచో తపోనిష్ఠలో ఉన్న నీ తండ్రి గారి నడుగుము అన్నది. ఆ బాలుడు తండ్రిని సమీపించి తండ్రీ మనమేల ఈ దారిద్ర్యము ననుభవించవలెను. మా మేనమామల వలె, మనకెందుకు ధనము లేదు? అది మనకెట్లు లభించును అని అడిగెను.

దానికి వ్యాఘ్రపాదుడు ఓ ఉపమన్యూ వారివారి ప్రారబ్ధమును బట్టి ఈశ్వరుడు సంపదలనొసంగును. ఒకనికి విద్యాధనము, ఒకనికి సువర్ణ ధనమును, ఒకరికి కీర్తి ధనమును, ఒకరికి భక్తి, ఒకరికి జ్ఞాన ధనమును ఆయన ఈయవలసినదే. నాకు విద్యాధనమే ఇచ్చినాడు. సువర్ణ ధనమీయలేదు. అందువలన మనవద్ద భోగభాగ్యములు లేవు అని చెప్పెను. అయినా ఉపమన్యుడు వదలకుండా మనకది లభించు ఉపాయము జెప్పుమని మరల అడిగాడు.

దానికి తండ్రి శివపంచాక్షరీ మహా మంత్రమును బోధించి కైలాస పర్వతమువద్ద కూర్చుని దీనిని పఠించిన శివపార్వతులు ప్రత్యక్షమయ్యెదరు.



అప్పుడు నీకు కావలసినది కోరుకో అని చెప్పెను. ఉపమన్యుడు తండ్రి జెప్పిన విధంగా చేశాడు. పార్వతీ పరమేశ్వరులు లోక విహారం చేయుచూ ఐదు సంవత్సరాల పసివాడి ఘోర తపస్సు చూచి ఆశ్చర్యపడి అతని పట్టుదల చూడనెంచి ఈశ్వరుడు వికృత రూపుదై ఉపమన్యుని చేరి ఒరే ఇది క్రూర జంతువుల తిరిగే చోటు, ఇక్కడ నీకేం పని? నీకు తపస్సేమిటి? నిన్ను ఏ పులో మింగేస్తే గతేమిటి? పోపో అన్నాడు.

దానికి ఉపమన్యుడు మృత్యుంజయుని శరణుబొందితే మృత్యువేం చేస్తుంది? అనవసరంగా నా కాలం పాడు చేయకు అన్నాడు. శివుని పరీక్షలు అంతులేని వన్నట్లు ఆ బాలునిపై కి వ్యాఘ్రములు, సింహములు దుముకుచున్నట్లు ధ్వనులు గర్జనలు వినిపించెను. వీసమైన తగ్గని మనోబలంతో ఉపమన్యుడు శివపంచాక్షరి జపించుచునే యుండెను.

అంతలో పార్వతీ పరమేశ్వరులు ఆ బాలుని యెదుట ప్రత్యక్షమై ఉపమనూ! ఇంత చిన్న వయస్సులో నీ దీక్ష, భక్తి అనితర సాధ్యం. మాకు ఎంతో ఆనందం కలిగింది నీకు



కావలసిన వరం కోరుకో అన్నారు.

దానికి ఆనంద భాష్పాలు కారుస్తూ ఆ బాలుడు ఓ జగన్మాతా పితలారా! మధురాన్నం భుజించిన వాడు అంబలి ఇష్టపడతాడా? సిరి సంపదలు సర్వస్వం అనుకొని జీవితమంతా శ్రమపడి నీవు నియమించిన యముడు పాశంతో ప్రాణం తోడుతున్నప్పుడు ఒక్క పూచిక పుల్లకూడా వెంట రాదు. నీ నామస్మరణొక్కటే కాపాడుతుంది. సత్యమే అసత్యమని అసత్యమే సత్యమనే భ్రమతో జీవించే నరులు ధనమూలమిదం జగత్ అనుకుంటారు. అది అసత్యమని తెలిసింది. అయినా దుర్భర దారిద్ర్యం అనుభవిస్తూ నీ భక్తి విడువని నా తల్లిదండ్రులను సుఖపెట్టుట నా కర్తవ్యం కనుక నాకు వారిని సుఖపెట్టే సిరి సంపదలు ప్రసాదించుము ధనంతో నీపై భక్తి ఇంకా హెచ్చు భాగ్యం ప్రసాదించు అన్నాడు.

కరుణాంతరంగుడైన శంకరుడు ఆ బాలునికి ఓ ఉపమన్యూ నీ కోరికలు ఈ రుద్ర కల్పాంతం వరకు

అనుభవించు. ఆ తరువాత కైలాసంలో నా రుద్రగణాలలో ఒకదానికి అధిపతివై వర్ధిల్లు అన్నాడు.

ఆ వరం ఫలించి ఉపమన్యుడు శివభక్తాగ్ర గణ్యుడై పేరొందాడు.

శ్లో॥ ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్, ధనమిచ్ఛేత్ హుతాశనః
జ్ఞానంమహేశ్వరాధిచ్ఛేత్, మోక్షమిచ్ఛేత్ జనార్దనః

కం॥ ఇచ్చును 'రవి' ఆరోగ్యము
మెచ్చుగ ధనమీయు అగ్ని, మించిన కరుణన్
ఇచ్చును జ్ఞానము శంభుడు
హెచ్చుగు మోక్షంబు నీయు, ఇందిర విభుడున్

తా॥ అనన్యమైన భక్తితో ఆరాధించినచో
సూర్యభగవానుడు ఆరోగ్యమును, అగ్నిదేవుడు
సంపదలను, శంకరుడు జ్ఞాన సంపదను,
లక్ష్మీపతియైన శ్రీహరి మోక్షమును ప్రసాదిస్తారు.



## 11. మధుకైటభుల చరిత్ర

కన్న తండ్రి తన పుత్రులను నిర్దాక్షిణ్యంగా మాయోపాయంతో చంపడం సృష్టిలోనే విచిత్రం. ఇక ఆ చంపే తండ్రి జగత్పోషకుడైన శ్రీమహావిష్ణువే అవటం మరీ విచిత్రం. ధర్మ రక్షణకు, దుష్ట శిక్షణకు పరదేవతచే నియమింపబడిన శ్రీమహావిష్ణువు ఆ పనే చేశాడు.

తొల్లి సృష్ట్యాదిన శ్రీమహావిష్ణు ముద్దులొలుకు పాపని వలె ఒక మఱ్ఱి ఆకుపై యోగ నిద్రలో ఉండగా ఆయన నాభినుంచి ఒక సహస్ర దళ కమలం ఆవిర్భవించింది. అదంతా యోగ పరాశక్తి లీల. ఆ కమలం నుండి బ్రహ్మ ఆవిర్భవించి పరదేవత ఆజ్ఞ పాటించి సృష్టి ఆరంభించుటెట్లాయని పరదేవతానుగ్రహమునకై తపస్సు చేయుచుండెను. విష్ణువు యోగనిద్ర జరుగుచునే యున్నది. ఇంతలో శ్రీమహావిష్ణువు యొక్క చెవులనుండి బలిష్ఠులైన ఇద్దరు రాక్షసులుద్భవించిరి. విష్ణు సంతానమైన వారు సుందరాకారులయ్యును, రాక్షస ప్రవృత్తివలన గర్విష్ఠులై అహంకారులై యుండిరి. మహార్ణవమంతా వెదకుచు తమ



నెదురించు వాడులేడని అహంకరించుచుండిరి.

వారికి పద్మ సంభవుడు కనిపించగానే ఓరీ నీవెవడవు? మేము శ్రీమహావిష్ణుని బిడ్డలము మాపేర్లు మధు, కైటభుడు. ఇక్కడ నీకేమి పని అని ప్రశ్నించిరి. దానికి బ్రహ్మ నేను శ్రీమహావిష్ణుని నాభి కమలం నుంచి పుట్టిన వాడను. నన్ను బ్రహ్మ అంటారు. జగత్ సృష్టి నిమిత్తం పరదేవత నన్ను శ్రీమహావిష్ణుని నాభికమలంనుంచి యుద్భవింపజేసింది. మీరు నాకు అన్నలు అని పలికాడు.

దానికి మధుకైటచులు సృష్టి నీవల్ల ఏం అవుతుంది. చిన్నవాడవు పైగా ఆ కమలంలో ఇరుక్కుపోయావు. చాల్చాలులే ఆ సృష్టి మేం చేస్తాం అన్నారు.

బ్రహ్మ చేయగలిగింది లేక తండ్రితో మొరబెట్టు కున్నాడు. తన కొడుకులే రాక్షసులయితే ఏ తండ్రి బాధపడడు? విష్ణువు కొంత దనుక చింతనొంది ఆపైన విషము జేరిన భాగములను కత్తిరించకున్న విషము దేహము నంతయు పాడుచేయునని చెప్పినట్లు ఈ దుష్టుల సృష్టి ఎంత



ఉపద్రవ కరమో ఊహింపలేము. ఇట్లు ఆలోచించి శ్రీహరి వారిని తుద ముట్టించుటకు యోచించెను. కానీ పుత్రులపై పరమాత్మకు అపరిమితమైన ప్రేమ. అందుచే ఊరకుండెను.

బ్రహ్మ పరదేవతతో ఈవిధంగా మొరబెట్టుకున్నాడు. ఓ జగజ్జనని నేను సృష్టి నెట్లారంభించగలను? పరమేశ్వరి ఆదిశక్తివి, పిపీలకాది బ్రహ్మ పర్యంతము కారణభూతురాలివి. క్షుత్పిపాసలకు, పుష్టికి, తుష్టికి, కారణమైన యోగ మాయవు. మహాలక్ష్మి, సరస్వతి, పార్వతి మొదలైన శక్తి స్వరూపిణు లంతా నీవే. సృష్టి స్థితి లయ కారిణివైన నీకు ఉపేక్షించుట తగదు.

మధుకైటభులనుండి నన్ను రక్షింపుము. నేను నాపని నారంభించెదను అన్నాడు. అప్పుడు పరదేవత విష్ణుకు చెప్పి బ్రహ్మ పనికి ఆటంకం లేకుండా చూడమని చెప్పింది. విష్ణువు నా వాళ్ళకు వరములిస్తానని, మధుకైటభులతో ఈ విషయం చెప్పి బ్రహ్మకు అంతరాయం కలిగించకండి అన్నాడు. వాళ్ళు ఓహో నీవు మాకు జెప్పువాడవా! పోపో. నీకు మేమే వరాలిస్తాం. కోరుకో కానీ మాకు నీతులు చెప్పకు అన్నారు.

ఇక కుమారులని ఉపోక్షించి లాభం లేదని శ్రీహరి ఆహా నా పుత్రులు ఎంతటి దానగుణ సంపన్నులు, మీరు నాచేతిలో మరణించాలని నా కోరిక అన్నాడు.

జరిగిన సంఘటనకు దిమ్మెరబోయిన మధుకైటభులు వరం నెరవేర్చనిచో తమకు అవమానం నెరవేర్చిన మరణం తప్పదని గ్రహించి పూర్తి జలార్ణవమును జూచి, సరే నీవు మమ్మల్ని చంపవచ్చు కానీ మా శరీరములకు తడి తగలకుండా చంపాలి అన్నారు. జగన్నాటక సూత్రధారి నారాయణుని ముందు ఇటువంటి తెలివి తేటలు నెగ్గుతాయా? విష్ణువు తన దేహాన్ని విపరీతంగా పెంచి వారిద్దరినీ తనచెవులలో నుండి వెలికి లాగి విశాలమైన తన తొడలపై పెట్టుకుని ఇద్దరి తలలను తన చక్రంతో నరికి నెత్తురు రాకుండా తలలు అదిమి చంపేశాడు. బ్రహ్మ సంతోషంగా తన సృష్టి బాధ్యతలు నెరవేర్చాడు. శ్రీమహావిష్ణువు తిరిగి యోగనిద్రలోకి జారుకున్నాడు. పరదేవత సంతసించింది.



చం॥ హరి తనకన్న సంతతియ నంచని జూడడు

దారి తప్పినన్

కొరతలు వేయు రాజువలె క్రూరుడు శిక్షల నీయు

వేళలన్

నరికెను కైటభున్ మధును నందనులైనను

చక్రమెత్తి ఆ

సరసిజ భవ్యుగావ, యిక, చావరెదానవు

లెవ్వరైననున్



## 12. జలంధరుని చరిత్ర

ఏ రాక్షసుని జీవిత చరిత్ర చూచినా పగ, ద్వేషము, హింసలతోనే నిండియున్నది. ప్రహ్లాదుడు విభీషణుని వంటి ఒకరిద్దరు వున్నప్పటికీ గడ్డిమేటలో సూదిలాగ దొరుకుట చాల కష్టం. ప్రతివాడూ చావు తప్పించుకోవాలని గొప్పగొప్ప వరాలను పొందటం శ్రీహరి తెలివినుపయోగించి ఆ వరాన్ని అడ్డుకుని ఆ రాక్షసుని చంపి లోక కళ్యాణం చేయటం జరుగుతుంటుంది. తల్లి దితి యొక్క అసూయ, పంతం ఆమె బిడ్డలైన దైత్యులకు జన్మతః వచ్చింది.

తండ్రిని చంపాడని కొడుకులు శ్రీహరితో వైషమ్యం పెంచుకొని తమ అపార బలసంపదలు శ్రీహరిని నిర్జించటానికే వినియోగించి భ్రష్టులయ్యారు. అటువంటి వారిలో జలంధరుడు ఒకడు. వాడు శివకేశవులిద్దరితోనూ వైరం పెంచుకుని భ్రష్టుడయ్యాడు.



హిరణ్యకశిపుడు అందరికీ ఆద్యుడు వాడు. ఎన్ని విధాలుగా మృత్యువుని తప్పించుకోవాలని జూచినా శ్రీహరి వాడి వరాలను అధిగమించి వాడిని నృసింహుడై చంపాడు.

ఆ హిరణ్యకశిపుని ప్రధమ సంతానం ప్రహ్లాదుడు శ్రీహరిభక్తుడు కాని వానికి వేరొక భార్యవలన కలిగిన పదిమంది కొడుకులూ దురాత్ములే. ఆ పదిమందిలో ఒకడైన అగ్నిజిహ్వుడనే వానికి సూకరుడు అనే కొడుకు పుట్టాడు. తాత హిరణ్యకశిపుని పోలికలు పుణికి పుచ్చుకున్న ఆ నీచుడు కూడా తాతగారిలా బ్రహ్మకై ఘోర తపస్సుచేసి నీటిలో గాని నేలపైగాని ఆకాశంలో గాని చోట, దేవతలచేత (దివికి పుట్టినవారు) గాని, రాక్షసుల చేతగాని నర, వానర, నాగ కిన్నెర కింపురుషాది జాతివారిచేగాని పక్షుల చేతగాని, జలచరముల చేత గాని, వారి ఆయుధముల చేత గాని, ఏ ఒక్క పురుషునిజేత గాని, స్త్రీజేత గాని చావు రాకూడదని కోరుకున్నాడు. నిత్యం జలచరాలవలె జలంలో ఉండగల వరం కోరుకున్నాడు. అందుకని జలంధరుడని పేరు

పొందాడు. బ్రహ్మకు ఆ వరాలు ఈయక తప్పలేదు. తన తాతలాగ వాడుకూడ స్వర్గాన్ని ముట్టడించి దేవతలను ఇంద్రుణ్ణి వెళ్ళగొట్టి పాలించాడు. వాడికి శివకేశవులిద్దరూ శత్రువులే. వాళ్ళిద్దరినీ నిర్మూలిస్తే తనే జగన్నియంత, తనని మాయోపాయాలతో చంపేవారుండరు. మృత్యుభయం లేదు.

ఈ విధంగా ఆలోచించి వాడు కైలాసంపై దండెత్తాడు. రుద్రగణాలు కూడా వాడినేం చేయలేక మౌనం వహించాయి. పరమేశ్వరుడు కూడా వాణ్ణి ఏమీ చేయలేక పోతున్నాడంటే విధి లీల కాక మరేమిటి? చివరకు ఈశ్వరుడు కూడా మానస సరోవరంలో తలదాచుకోవలసి వచ్చింది.

ఇక జలందరుడి గర్వం రెట్టింపయి వైకుంఠంపై దండెత్తాడు. వైకుంఠం వాకిళ్ళన్నీ తెరుచుకున్నాయి. వాడు వైకుంఠమంతా వెదికాడు. శ్రీహరి కూడా మానస సరోవరంలోనే ఇంకొక ప్రాంతంలో తలదాచుకున్నాడు. జలంధరుడు అందరికీ నేనే జగన్నాథుడనని చెప్పి దిక్పాలురు, దేవతలు మొదలైన ఏ ప్రాణి అయినా తన ఆధిపత్యాన్ని



ఒప్పుకోకపోతే దండన తప్పదని ప్రకటించాడు.

నారదుడు కూడ నారాయణ మంత్రం మనస్సులోనే స్మరించవలసి వచ్చింది. శ్రీహరి, శంకరులు పరదేవతని పరబ్రహ్మను వేడుకుని మానస సరోవరంలోనుంచే తపస్సు చేయడం మొదలు పెట్టారు. జలంధరుడి పాపం పండే వేళకు శ్రీహరి, శంకరుల తపస్సు ఫలించి వారి ముందు ప్రత్యక్షమయ్యారు. పరబ్రహ్మ చెప్పిన అమోఘమైన ఉపాయం అందరికీ నచ్చింది. దానిని ఆచరణలో ఈ విధంగా పెట్టారు శివకేశవులు. శివుడు చక్రమును శ్రీహరి త్రిశూలమును ధరించారు. జననమే లేనివారు గావున వారు ఏ జాతివారూ కారు. వారు జలంధరుని నీటిలోనూ నీటి బయట గాక అనగా నీటిలో నిలబడి, రాక్షస సంహారమును ఇద్దరూ కలిసి చేసిన జలంధరుడి షరతులన్ని నెరవేరగలవు. ఇదీ పథకం.

సరే నారదుడు జలంధరుని సమీపించి జయజయధ్వానములు పలికి శివకేశవులు మానస సరోవరంలో నివసిస్తున్నట్లు వారిని నీటిలోనే మట్టుబెట్ట



వలెనని సలహా ఇచ్చాడు. జలంధరుడు తనకున్న అమోఘ శక్తితో నీటి అడుగున నున్న ప్రతి పద్మాన్నీ వెదికాడు. బాగా అలసిపోయి పిరికి వాళ్ళని తిట్టుకుంటూ నీటి వెలుపలికి రాబోతున్నాడు. సరిగా అప్పుడు శివకేశవులిద్దరూ ఒకరి ఆయుధం ఇంకొకరు (శివుడు చక్రము విష్ణువు త్రిశూలం) ధరించి ఇద్దరూ ఒకేసారి నీటి నడుము వరకు నిలబడ్డ అతన్ని ఒకే సమయంలో శిరస్సు ఖండించి చంపారు. పరదేవత, పరబ్రహ్మ ఆనందించి శివకేశవులను అభినందించారు. జలంధరుని మరణంతో లోకాలు సంతోషించాయి.



సీ॥ జలచరంబనిపించ జలమున వసియించు
ఆ జలంధరునికి అడ్డులేదు
ఎవరి ఆయుధముచేయే యొక్కనిచె గాని
తావుయేదైనను చావురాదు
దేవేంద్రునోడించె శివుని జంపగ బోయె
వైకుంఠు పగబట్టి వెదకె దునుమ
నారదాదులు కూడ 'నారాయణా' యని
అనలేక లోలోన గొణగ వలసె

తే॥ వారు పరదేవతను వేడ కరుణ గలిగి
దారి జూపెను ఆమాత దనుజు జంప
శివుని గాథలు మధురము బ్రోవ జనుల
వెలయ జెప్పితినా భాగ్యఫలము జుమ్మి.